www.suryaa.news
ప్రభాత సూర్య
తెలుగు జాతీయ దిన పత్రిక
వేల రూ.5/ - పేజీలు : 8 ఆదివారం 25 మే 2025 సంపుటి: 01, సంచిక : 21
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## సిస్టర్ స్ట్రోక్‌తోనే కేటీఆర్ అలా మాట్లాడారు: మంత్రి సీతక్క

**హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తాజాగా చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క స్పందించారు. గోబెల్స్ ప్రచారంలో కేటీఆర్ ను మించిన వారే లేరని కౌంటర్ ఇచ్చారామె. శనివారం మం?త్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ.. "కవిత చెప్పిన దెయ్యం కేటీఆరే. సిస్టర్ స్ట్రోక్‌తో కేటీఆర్ చిన్న మెదడు చిట్లింది. కాళేశ్వరంలో కమీషన్లు తిన్నప్పుడు లేని భయం.. కమిషన్ ముందు హాజరయ్యేటప్పుడు ఎందుకు?. అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ నడుస్తోంది. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి కేటీఆర్‌కు లేదు" అని అన్నారామె.

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

# మనమంతా టీమిండియా




- కేంద్ర రాష్ట్రాలు కలసికట్టుగా సాగాలి
- అప్పుడు ఏ లక్ష్యమూ అసాధ్యం కాదు
- నీతి ఆయోగ్ భేటీలో సీఎంలకు పిలుపు
- రాష్ట్రానికో ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రం
- ప్రగతి వేగం పెంచుదామన్న ప్రధాని

సూర్య న్యూఢిల్లీ

కేంద్రం, రాష్ట్రాలను 'టీమిండియా'గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. అవి కలసికట్టుగా పని చేస్తే ఏ అభివృద్ధి లక్ష్యమూ అసాధ్యం కాబోదనీ ధీమా వెలిబుచ్చారు. శనివారం ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ పాలక మండలి 10వ భేటీకి ఆయన సారథ్యం వహించారు. వికసిత భారత్-2047 థీమ్‌తో భేటీ సాగింది. 31 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ప్రతినిధులు భేటీలో పాల్గొన్నట్టు నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం వెల్లడించారు. పశ్చిమ బెంగాల్, బిహార్, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలు పాల్గొనలేదని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ముఖ్యమంత్రులతో మోదీ సమావేశమవడం - మిగతా3లో



## రాహుల్ గాంధీపై నాన్ బెయిలబుల్ వారెంట్

జూన్ 26వ తేదీన స్వయంగా న్యాయస్థానంలో హాజరు కావాలని ఆదేశం

2



## విమానాల కిటికీలు మూయండి!

- పశ్చిమ సరిహద్దు వెంబడి ఉన్న అన్ని డిఫెన్స్ ఎయిర్‌పోర్టుల్లో అమలుచేయండి
- ప్రైవేట్ విమానయాన సంస్థలను ఆదేశించిన డీజీసీఏ

# మెట్రో విస్తరణకు నిధులివ్వండి

- తెలంగాణ ప్రాజెక్టులకు సహకరించండి
- ఆర్ఆర్ఆర్ నిర్మాణం ఏకకాలంలో చేపట్టండి
- బందరు పోర్టు నుంచి హైదరాబాద్‌కు గ్రీన్‌ఫీల్డ్ హైవే కావాలి
- సెమీకండక్టర్, రక్షణరంగ ప్రాజెక్టులకు మద్దతివ్వండి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి



సూర్య న్యూఢిల్లీ

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ, ప్రాంతీయ రింగ్‌రోడ్డు, రింగ్ రైలు తదితర ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేందుకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం ఢిల్లీలో నీతి ఆయోగ్ సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లిన అంశాలు మెట్రో రైలు ఫేజ్-1లో 69 కిలోమీటర్ల నిడివితో మూడు కారిడార్లు ఉన్నాయి. - మిగతా2లో

## చేనేత వస్త్రాల్లో మరింత అందంగా..



- పోచంపల్లి, గద్వాల, గొల్లభామ చీరలతో అందాల భామల ర్యాంప్ వాక్
- తర్వాత ఆధునిక ఫ్యాషన్ వస్త్రాలతోనూ..
- ఘనంగా మిస్ వరల్డ్ ఫ్యాషన్ ఫినాలే
- ఆసియా-ఓషియానా విజేతగా నందిని

సూర్య హైదరాబాద్

మిస్ వరల్డ్ వేదికపై తెలంగాణ చేనేత వస్త్రాలు తళుక్కున మెరిశాయి. శనివారం ట్రైడెంట్ హొటల్‌లో జరిగిన వరల్డ్ ఫ్యాషన్ ఫినాలేలో ప్రపంచ సుందరి పోటీదారులంతా అంతర్జాతీయ ఖ్యాతి పొందిన పోచంపల్లి, గద్వాల్ చేనేత వస్త్రాలు ధరించి ర్యాంప్ వాక్ చేశారు. సంప్రదాయబద్ధమైన దుస్తుల్లో అలరించారు. అమెరికా, కరేబియన్ దేశాల - మిగతా2లో

## దేశంలో జిల్లాకో ఫోరెన్సిక్ ల్యాబ్

- ఈ ఆర్థిక ఏడాదిలో నెలకొల్పేందుకు కృషి
- ఫోరెన్సిక్ నెట్‌వర్క్ పటిష్టానికి చర్యలు: సంజయ్




సూర్య హైదరాబాద్

దేశంలోని ప్రతి జిల్లాలో ఫోరెన్సిక్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. దీంతో పాటు అధునాతన పరికరాలతో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లను విస్తరిస్తామని చెప్పారు. న్యాయ ప్రక్రియలో 'ఫోరెన్సిక్-ఫస్ట్ అప్రోచ్'ను భాగం చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. 'నూతన నేర చట్టాల నేపథ్యంలో - మిగతా2లో

## తెలంగాణకు పట్టిన దెయ్యం రేవంత్... శని కాంగ్రెస్

ఆ దెయ్యాన్ని వదిలించాలన్నదే బీఆర్ఎస్ ప్రయత్నం: కేటీఆర్




సూర్య హైదరాబాద్

తెలంగాణకు పట్టిన దెయ్యం రేవంత్‌రెడ్డి అని, రాష్ట్రానికి పట్టిన శని కాంగ్రెస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తీవ్రస్థాయిలో మండి పడ్డారు. ఆ దెయ్యాన్ని, శనిని వదిలించాలన్నదే తమ ప్రయత్నమని పేర్కొన్నారు. 'కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దెయ్యాలు'ఉన్నాయంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ ఈమేరకు పరోక్ష వ్యాఖ్యలు చేశారు. 'అంతర్గత విషయాలను ప్రస్తావించేందుకు పార్టీ వేదికలు - మిగతా2లో



## కొలీజియంలోకి జస్టిస్ నాగరత్న

న్యూఢిల్లీ

మరో రెండేళ్ల తర్వాత సుప్రీంకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి రికార్డ్ సృష్టించబోతున్న జస్టిస్ బీవీ నాగరత్న నేడు సుప్రీంకోర్టు కొలీజియంలో లాంఛనంగా సభ్యురాలు కాబోతున్నారు. ఇంతకాలం కొలీజియంలో సభ్యునిగా ఉన్న సుప్రీంకోర్టు మరో సీనియర్ న్యాయమూర్తి - మిగతా2లో

# బీఆర్ఎస్ 3 ముక్కలు కావడం ఖాయం

- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్
- భవిష్యత్తు రాజకీయ ముఖచిత్రంలో ఆ పార్టీ ఉండదు
- ఇంట్లో పోరు తట్టుకోలేక కేటీఆర్ సతమతమవుతున్నారు
- పార్టీ పగ్గాల కోసం కవిత, కేటీఆర్ మధ్య తీవ్ర పోటీ ఉంది
- హరీశ్‌రావు అదను కోసం ఎదురు చూస్తున్నారు



సూర్య హైదరాబాద్

కేసీఆర్ కుటుంబంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను గమనిస్తే.. భవిష్యత్తులో తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉండదని, అది మూడు, నాలుగు ముక్కలవుతుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఇంట్లో పోరు తట్టుకోలేక కేటీఆర్ సతమతమవుతున్నారని, పార్టీ పగ్గాల కోసం కవిత, కేటీఆర్ మధ్య తీవ్ర పోటీ నెలకొందని చెప్పారు. ఈ నేపథ్యంలో హరీశ్‌రావు అదను కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మహేశ్‌గౌడ్ శనివారం తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ ముందు ఇంట్లో కుంపటిని సరిచేసుకోవాలి 'ఇంట్లో కుంపటి తట్టుకోలేక.. సోదరి తనకే ఏకు మేకై, మరో పవర్ సెంటర్ కావడంతో - మిగతా2లో

## కొవిడ్, డెంగీ పేరిట ఆందోళనకు గురిచేయొద్దు

- రోగులను దోచుకునే ప్రయత్నం చేసే ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు
- దామోదర రాజనర్సింహ

సూర్య హైదరాబాద్

కొవిడ్, డెంగీ వ్యాధుల పేరిట రోగులను ఆందోళనకు గురిచేసి, దోచుకునే ప్రయత్నం చేసే ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. కొవిడ్ గురించి ఆందోళన చెందాల్సిన - మిగతా2లో



# బీఆర్ఎస్ 3 ముక్కలు కావడం ఖాయం

-మొదటిపేజీ తరువాయి

మతి భ్రమించి కేటీఆర్ ఆ ఎపిసోడ్‌ని డైవర్ట్ చేయడం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పసలేని ఆరోపణలు చేస్తున్నారు. తన ఇంట్లో రగులుతున్న కుంపటిని కేటీఆర్ ముందుగా సరిచేసుకోవాలి. కవిత.. కేసీఆర్‌కే లేఖ రాసి పది సంవత్సరాల తప్పిదాలను ఎత్తి చూపే స్థాయికి వచ్చిందంటే, కేసీఆర్ కుటుంబంలో రగులుతున్న మంట ఎంత పెద్దదో అర్థమవుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని మెజారిటీ ప్రజలు నమ్మిన నేపథ్యంలో వారి ఆకాంక్షల మేరకు విచారణ కమిషన్ వేశాం. కేసీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇస్తే కేటీఆర్ బెంబేలెత్తారు. అవినీతి బాగోతం బయటపడుతుందన్న భయంతో ఆయన మాట్లాడుతున్నట్లు కనిపిస్తోంది.

**బీఆర్ఎస్, బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం..**

ఫార్ములా ఈ%-%కార్ రేసులో అవినీతి బట్టబయలైంది. అందులో కేటీఆర్ దొరికిపోయారు. హైదరాబాద్, దాని చుట్టపక్కల కొన్ని వేల ఎకరాల ప్రభుత్వ భూములను తక్కువ ధరకే తన సన్నిహితులు, బంధువులకు అప్పజెప్పిన వైనం ఇంకా తెలంగాణ ప్రజలు మర్చిపోలేదు. కవిత లేఖలో ఆమె ప్రస్తావించిన అంశాలను పరిశీలిస్తే.. బీజేపీకి, బీఆర్ఎస్‌కు పరిపూర్ణమైన లోపాయికారి ఒప్పందం ఉందని స్పష్టంగా తెలుస్తోంది. బీఆర్ఎస్ గతంలో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందించిన కారణంగానే కవిత లిక్కర్ కేసులో ఇరికినప్పుడు అమిత్‌షా దగ్గరకు వెళ్లి బేరం కుదుర్చుకుని బెయిల్ వచ్చే విధంగా చేసుకున్న విషయాన్ని ప్రజలు మర్చిపోలేదు. బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య లోపాయికారి మైత్రి ఉంది కాబట్టే బెయిల్ సునాయాసమైంది. కేటీఆర్, హరీశ్‌రావులే కదా.. ఆ బేరసారాలు చేశారు. తమ అవినీతి బయటపడకుండా ఉండేందుకు మోదీ, అమిత్‌షా కాళ్లు ఎవరు పట్టుకున్నారో తెలంగాణ ప్రజలందరికీ తెలుసు.

**కేసీఆర్‌ను ఫామ్ హౌస్‌లో బందీ చేశారు..**

హరీశ్‌రావు, కేటీఆర్ కలసి కేసీఆర్‌ను ఫామ్ హౌస్‌లో బందీ చేశారని నేను దాదాపు మూడున్నర నాలుగు మాసాల క్రితం చెప్పాను. అదిప్పుడు వాస్తవం అని తెలుస్తోంది. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని కవిత చెప్పారు. ఆ దెయ్యాలు ఎవరో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది. కేసీఆర్ మొదలుకొని.. కేటీఆర్, హరీశ్‌రావు, కవిత సహా ఆ కుటుంబం అంతా విచ్చల విడిగా అవినీతికి పాల్పడిన విషయాన్ని పదేళ్లుగా చూశాం. వారి మధ్య వైరం వచ్చిందంటే రాజకీయ పదవుల పోటీ ఒకటైతే.. పంపకాల్లో కూడా తేడా వచ్చిం దనేది నా అనుమానం. అందుకే కవిత ఇవాళ బాహాటంగా తిరుగుబాటు జెండా ఎగురవేసినట్లు కనిపిస్తోంది. కేసీఆర్‌కు పట్టిన దెయ్యం కూడా కేటీఆరేనని కవిత చెప్పకనే చెప్పారు. దీంతో ఇంట్లో జరుగుతున్న పోరు ప్రజలకు తెలియకుండా ఉండేందుకు కేటీఆర్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నట్లు కనిపిస్తోంది'అని మహేశ్‌గౌడ్ అన్నారు.

**ఘనంగా మహేశ్‌గౌడ్ జన్మదిన వేడుకలు**

టీపీసీచీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పుట్టినరోజు సందర్భంగా శనివారం ఢిల్లీలో పలువురు కాంగ్రెస్ నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధి సుధాకర్‌గౌడ్ తదితరులు మహేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి మిఠాయిలు తినిపించారు. అలాగే మహేశ్‌గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాయి. హైదరాబాద్ గాంధీభవన్‌లో తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కల్లుగీత పారిశ్రామిక సంఘం చైర్మన్ నాగరాజు గౌడ్, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

# మెట్రో విస్తరణకు నిధులివ్వండి

-మొదటిపేజీ తరువాయి

నగరంలోని ఇతర ప్రాంతాలకు మెట్రోను తక్షణం విస్తరించాల్సిన అవసరం ఉంది. ఫేజ్%-%2 కోసం కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించాం. ఇందులో 76.4 కిలోమీటర్ల నిడివితో 5 కారిడార్లు ఉంటాయి. కేంద్రం, రాష్ట్రం కలిసి చేపట్టాల్సిన ఈ జాయింట్ వెంచర్ మొత్తం ఖర్చు రూ.24,269 కోట్లు. ఇందులో కేంద్రం వాటా 18 శాతం (రూ.4,230 కోట్లు). రాష్ట్ర వాటా 30 శాతం (రూ.7,313 కోట్లు). రుణం 48 శాతం (రూ.11,693 కోట్లు). 2024 అక్టోబర్‌లో చెన్నై మెట్రో ఫేజ్%-%2కు రూ.63,246 కోట్లు, 2021 ఏప్రిల్‌లో బెంగళూరు మెట్రో ఫేజ్%-%2 కు రూ.14,788 కోట్లు, 2024 ఆగస్టులో బెంగళూరు మెట్రో ఫేజ్%-%3కి రూ.15,611 కోట్లు కేంద్రం ఆమోదం తెలిపింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్%-%2పై కేంద్రం కొన్ని వివరణలు కోరగా, వాటికి సమాధానాలిచ్చాం. ఈ ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపాలి.

**ప్రాంతీయ రింగ్ రోడ్డు**

హైదరాబాద్ చుట్టూ రెండు జాతీయ రహదారులతో కలిపి ప్రాంతీయ రింగు రోడ్డును (ఆర్ఆర్ఆర్)ను తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం సంగారెడ్డి %-% నర్సాపూర్ %-% తూప్రాన్ %-% గజ్వేల్ %-% భువనగిరి %-% చౌటుప్పల్ మధ్య 161వ నంబర్ జాతీయ రహదారి ఉండగా.. దక్షిణ భాగం చౌటుప్పల్ %-% ఆమన్‌గల్ %-% షాద్‌నగర్ %-% సంగారెడ్డి మధ్య ఎన్‌హెచ్ 65 ఉంది. ఉత్తర భాగం కోసం భూసేకరణ ప్రక్రియ 2022లో ప్రారంభమైంది. 90 శాతం భూముల ప్రపోజల్స్ ఎన్‌హెచ్ఏఐకి పంపించాం. ఎన్‌హెచ్ఏఐ టెండర్లు కూడా పిలిచింది. అయితే, ఈ భాగానికి అవసరమైన ఆర్థిక, కేబినెట్ ఆమోదం ఇవ్వాలి. దక్షిణ భాగాన్ని కూడా ఉత్తర భాగంతోపాటే చేపట్టాలి. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పూర్తయిన తర్వాత దక్షిణ భాగం నిర్మాణం చేపడితే భూ సేకరణ, నిర్మాణ వ్యయం భారీగా పెరిగే ప్రమాదం ఉంది. అందువల్ల రెండు భాగాలను కలిపి ఒకేసారి పూర్తి చేయాలి. ఉత్తరభాగంలాగే దక్షిణ భాగం భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

**రింగ్ రైల్వే ప్రాజెక్టు.. గ్రీన్‌ఫీల్డ్ హైవే**

రీజినల్ రింగు రోడ్డుకు సమాంతరంగా 370 కి.మీ. పరిధిలో రైల్వే లైన్ ప్రతిపాదించాం. ఇది రాష్ట్రాభివృద్ధికి కొత్త దిశలో మార్గం చూపుతుంది. బందరు పోర్టు నుంచి హైదరాబాద్ డ్రైపోర్ట్ వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే మంజూరు చేయండి. దేశం మొత్తం ఔషధాలలో తెలంగాణే 35 శాతం ఉత్పత్తి చేస్తోంది. బందరు పోర్ట్ %-% డ్రైపోర్ట్ గ్రీన్ ఫీల్డ్ హైవే సరుకు రవాణా ఖర్చు తగ్గించడంతో పాటు ఎగుమతులకు దన్నుగా నిలుస్తుంది. ఈ మార్గం తయారీ రంగానికి ప్రోత్సాహకంగా ఉండడంతో పాటు నూతన ఉద్యోగాలను సృష్టిస్తుంది.

**సెమీకండక్టర్ రంగానికి మద్దతివ్వండి**

ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం)కు తెలంగాణ పూర్తి మద్దతు ఇస్తోంది. హైదరాబాద్‌లో ఏఎండీ, క్వాల్‌కాం, ఎన్‌విడియా వంటి ఆర్అండ్‌డీ కేంద్రాలు ఉన్నాయి. పరిశ్రమలకు స్థలాలు, నైపుణ్యం గల మానవ వనరులు, మౌలిక సదుపాయాలు హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ ఐఎస్ఎం ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉంది. అది పెట్టుబడిదారులకు నమ్మకాన్ని కలిగించి ఉద్యోగాలు సృష్టిస్తుంది. 2030 నాటికి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిలో 500 బిలియన్ డాలర్లకు చేరుకోవాలనే లక్ష్యానికి తోడ్పడుతుంది.

**రక్షణరంగ ప్రాజెక్టులకు తోడ్పాటునివ్వండి**

హైదరాబాద్‌లో ప్రభుత్వ, ప్రభుత్వ%-%ప్రైవేటు భాగస్వామ్యంలో, ఎంఎస్ఎంఈల్లో ఉన్న రక్షణరంగ ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వండి. హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓ, డిఫెన్స్ పీఎస్‌యూ లు ఉన్నత స్థాయిలో పని చేస్తున్నాయి. వాటి పరిధిలో వె య్యికి పైగా ఎంఎస్ఎంఈలు, స్థానిక, అంతర్జాతీయ డిఫెన్స్ సంస్థలకు విడి భాగాలు తయారు చేస్తున్నాయి. లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, జీఈ, సాఫ్రాన్, హనీవెల్ వంటి సంస్థలు హైదరాబాద్‌పై ఆసక్తి చూపుతున్నాయి. రక్షణ రంగంలోని జేవీలు, ఆఫ్‌సెట్‌లకు కేంద్ర ఆర్డర్లు తక్షణ అవసరం. వీటికి ఆమోదం తెలిపేందుకు ప్రత్యేకమైన వ్యవస్థ ఉండాలి.

**హైదరాబాద్ %-% బెంగళూరు డిఫెన్స్ కారిడార్**

రక్షణ రంగానికి సంబంధించి ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రోత్సాహం ఉంది కానీ హైదరాబాద్‌కు లేదు. ఆయా రాష్ట్రాలతో సమానంగా తెలంగాణకు కేంద్రం మద్దతు ఇవ్వాలి. రక్షణ రంగ పరికరాల తయారీలో ముందున్న హైదరాబాద్‌లో డిఫెన్స్ ఎక్స్‌పో నిర్వహించాలి.

**మరో 800 ఎలక్ట్రిక్ బస్సులివ్వండి**

కేంద్రమంత్రి కుమారస్వామికి సీఎం రేవంత్ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు మరో 800 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఢిల్లీలో కేంద్రమంత్రితో సీఎం శనివారం భేటీ అయ్యారు. ఇటీవల హైదరాబాద్‌కు రెండువేల ఈవీ బస్సులు కేటాయించారని, ప్రస్తుత నగర అవసరాలను దృష్టిలో పెట్టుకొని పీఎం ఈ%-%డ్రైవ్ పథకం కింద అదనంగా 800 బస్సులు కేటాయించాలని కోరారు. ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్‌లు బస్సు నిర్వహణ చూసేలా హైబ్రిడ్ జీసీసీ మోడల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ఆర్టీసీ డీజిల్ బస్సుకు చేపట్టిన రెట్రోఫిట్టెడ్ సఫలమైందని, ఆ బస్సు నగరంలో రాకపోకలు సాగిస్తోందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులకు రెట్రో ఫిట్‌మెంట్ అవకాశం కల్పించాలని సీఎం కోరారు.

# తెలంగాణకు పట్టిన దెయ్యం రేవంత్... శని కాంగ్రెస్

-మొదటిపేజీ తరువాయి

ఉంటాయి. అధ్యక్షుడిని కలిసే అవకాశం ఉంటుంది. ఆఫీసు బేరర్స్‌ను కలిసి చెప్పుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి కొన్ని విషయాలను అంతర్గతంగా మాట్లాడితేనే బాగుటుంది. ఈ సూత్రం వాళ్లకు వీళ్లకు కాదు.. పార్టీలో ఉన్న కార్యకర్తలందరికీ వర్తిస్తుంది. ప్రజాస్వామిక స్ఫూర్తి కలిగిన బీఆర్ఎస్‌లో అధ్యక్షుడు కేసీఆర్‌కు లిఖితపూర్వకంగా లేదా మౌఖికంగా సూచనలిస్తూ ఎవరైనా లేఖలు రాయొచ్చు. అయితే పార్టీలో ఏ హోదాలో ఉన్న వారైనా కొన్ని అంతర్గత విషయాలను అంతర్గతంగా మాట్లాడితేనే బాగుంటుంది'అని కేటీఆర్ అన్నారు. 'లోక్‌సభ ఎన్నికలకు ముందు మేము పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమీక్ష పెట్టి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో ఎలా ముందుకు పోవాలని వేల మంది కార్యకర్తలతో గంటలకొద్దీ చర్చించాం. ఆ క్రమంలో చాలామంది నేరుగా మైక్‌లో మాట్లాడారు. మరికొందరు కేసీఆర్‌కు ఇవ్వమంటూ లేఖలు ఇచ్చారు. మా పార్టీలో బహిరంగ చర్చను ప్రోత్సహిస్తాం. ప్రజాస్వామిక స్ఫూర్తి కలిగిన మా పార్టీ అధ్యక్షుడికి ఎవరైనా సూచనలు చేయొచ్చు, ఉత్తరాలు రాయొచ్చు'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అన్ని పార్టీల్లో ఉన్నట్లు బీఆర్ఎస్‌లోనూ రేవంత్ కోవర్టులు ఉండొచ్చని, సరైన సమయంలో వారంతటే వారు బయటపడతారన్నారు.

**ఓటుకు నోటు కేసులో 'బ్యాగ్‌మ్యాన్'**

'యంగ్ ఇండియా నేషనల్ హెరాల్డ్ కేసులో సీఎం రేవంత్ రెడ్డి పేరును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్‌లో చేర్చడం రాష్ట్రానికి అవమానకరం. ఈ కేసులో రేవంత్ పేరు వచ్చిందన్న వార్తను కొన్ని పత్రికలు అసలు రాయనే లేదు. మీడియా ఎంత




తాపత్రయపడ్డా.. ఎన్ని ప్రకటనలు తీసుకున్నా రేవంత్ ఒక లొట్ట పీసు ముఖ్యమంత్రి అని ప్రజలకు అర్థమైపోయింది. మీడియా ఎన్ని దాచినా సోషల్ మీడియాతో ప్రజలకు వాస్తవాలు తెలుస్తూనే ఉంటాయి. ఓటుకు నోటు కేసులో బ్యాగ్‌మ్యాన్ అని పేరు తెచ్చుకున్న రేవంత్ వైఖరి మారలేదని ఈడీ చార్జిషీట్‌లో బయటపడింది. కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారగా, ఢిల్లీ కాంగ్రెస్‌కు అవసరమైనప్పుడల్లా భారీ మొత్తంలో ఇస్తూ రేవంత్ తన పదవి కాపాడుకుంటున్నాడు. నైతికత ఉంటే రేవంత్ సీఎం పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలి లేదా కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ఆయనను పదవి నుంచి తప్పించాలి. ప్రధాని మోదీ, అమిత్ షాతో ఒప్పందం కుదుర్చుకునేందుకే రేవంత్ ఢిల్లీ వెళ్లారు. 17 నెలల్లో 44 సార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ కేసుల నుంచి తప్పించాలని చీకట్లో అమిత్ షా కాళ్లు పట్టుకుంటున్నాడు. రేవంత్‌కు రాహుల్ గాంధీ అధికారిక బాస్ కాగా, మోదీ, అమిత్ షా అనధికార బాస్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఏడాదిన్నరగా బీఆర్ఎస్‌పై నిందలు, బిల్డర్లు కాంట్రాక్టర్లతో దందాలు, ఢిల్లీ బాస్‌లకు రూ.వేలకోట్ల చందాలు అనే రీతిలో రేవంత్ పాలన సాగుతోంది. రేవంత్ అవినీతిపై రాహుల్ మాట్లాడాలి. ఈడీ చార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు ఉన్నా జపాన్ టూర్ పేరిట రేవంత్ స్పందించకుండా తప్పుకున్నాడు'అని కేటీఆర్ విమర్శించారు.

**కాంగ్రెస్, బీజేపీ నడుమ అపురూప బంధం**

'నేషనల్ హెరాల్డ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రేవంత్ విషయంలో తెలంగాణ బీజేపీ నేతలు మౌన మునుల్లా మారిపోయారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు చేస్తున్న భూదందా అక్రమాలకు రేవంత్ వత్తాసు పలుకుతున్నందుకే మౌనమా'అని కేటీఆర్ ప్రశ్నించారు. రూ.187 కోట్ల వాల్మీకి స్కామ్, ట్రిపుల్ ఆర్ టాక్స్, హెచ్‌సీయూ భూముల్లో అక్రమాలు, పౌర సరఫరాల కుంభకోణం జరుగుతున్నా కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదు. రేవంత్‌కు రక్షణ కవచంలా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వం స్పందించకుంటే నెల రోజుల తర్వాత మా కార్యాచరణ ప్రకటిస్తాం. ముఖ్యమంత్రిని ప్రాసిక్యూట్ చేయాలని గవర్నర్‌ను కోరతాం'అని చెప్పారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, రాజయ్య పాల్గొన్నారు.

## కొవిడ్, డెంగీ పేరిట ఆందోళనకు గురిచేయొద్దు

-మొదటిపేజీ తరువాయి

అవసరం లేదని ప్రజలకు మంత్రి సూచించారు. శనివారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో కరోనా వైరస్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నియంత్రణపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. భారత్‌లో పరిస్థితి సాధారణంగానే ఉందని, జేఎన్.1 వేరియంట్ కేసులు కొన్ని నమోదయ్యాయని, ప్రస్తుతం కొవిడ్‌పై ఆందోళనకర పరిస్థితులేమీ లేవని అధికారులు వివరించారు. రాష్ట్రంలో అక్కడక్కడ కోవిడ్ కేసులు నమోదవుతున్నాయని, వారికి చికిత్స అందించడానికి అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ.. జలుబు, దగ్గులాగే కొవిడ్ కూడా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందని, ప్రజలు పరిశుభ్రతపై ఎక్కువ శ్రద్ధ చూపాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వ ఉంటే దోమలు పెరిగి, వ్యాధులు వ్యాపించే ప్రమాదముంటుందని, ఈ విషయంపై ప్రజలకు అర్థమయ్యేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

## విమానాల కిటికీలు మూయండి!

న్యూఢిల్లీ

కొన్నిసార్లు తప్పనిసరి పరిస్థితుల్లో రక్షణశాఖ పరిధిలోని విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించే ప్రైవేట్ విమానాల, చార్టర్, ప్రైవేట్ జెట్ నిర్వహణ సంస్థలు కచ్చితంగా తమ విమానాల కిటికీలను మూసే ఉంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) శనివారం ఒక ప్రకటన విడుదలచేసింది. డిఫెన్స్ స్థావరాలు, విమానాశ్రయాల పూర్తి వివరాలు బహిర్గతం కావొద్దనే ఉద్దేశ్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. కిటికీల నుంచి ఫొటోలు, వీడియోలు తీయకుండా నివారించే ఉద్దేశ్యంతో కిటికీలను మూసే ఉంచాలని, కిటికీల షేడ్స్ తొలగించకూడదని ప్రైవేట్ విమానయాన సంస్థలకు డీజీసీఏ పంపిన ఉత్తర్వులో స్పష్టంచేసింది. మొత్తంగా 32 ఎయిర్‌పోర్ట్‌లలో ఈ నిబంధనను అమలుచేయనున్నట్లు తెలుస్తోంది. లేహ్, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, ఆదంపూర్, చండీగఢ్, బఠిండా, జైసల్మేర్, నాల్, జోధ్‌పూర్, హిండన్, ఆగ్రా, కాన్పూర్, బరేలీ, మహారాజ్‌పూర్, గోరఖ్‌పూర్, భుజ్, లొహెగావ్, డాబోలిమ్(గోవా), విశాఖపట్నంలోని విమానాశ్రయాలు ఈ ఆదేశాలను కచ్చితంగా పాటించాల్సి ఉంది. ఆర్మీ, నేవీ విమానాల రాకపోకలతోపాటు సాధారణ ప్రయాణికుల విమానాల రాకపోకలు సాగించే ఎయిర్‌పోర్ట్‌లలో ముఖ్యంగా ఈ నిబంధనను అమలుచేయనున్నారు. అక్కడి నుంచి రాకపోకలు సాగించే ప్రైవేట్ విమానాలు, చార్టర్, ప్రైవేట్ జెట్‌లలో ప్రయాణించే వాళ్లు కిటికీల గుండా కెమెరా, స్మార్ట్‌ఫోన్‌లతో ఎయిర్‌బేస్‌ల ఫొటోలు, వీడియోలు తీసే ఆస్కారముందని గ్రహించి ప్రభుత్వం కొత్తగా పలు పశ్చిమ తీర ఎయిర్‌పోర్టుల్లో ఈ నిబంధనను అమల్లోకి తెస్తోంది. విమానం టేకాఫ్ అయ్యాక 10,000 అడుగుల ఎత్తుకు వెళ్లేదాకా విండో షేడ్స్ తొలగించకూడదు. 10,000 అడుగుల కంటే ఎత్తులో ప్రయాణిస్తున్నప్పుడు విమానం ల్యాండింగ్‌కు సిద్ధమైతే ఆ ఎత్తులో విండో షేడ్స్ తెరుచుకోవచ్చు. కానీ ల్యాండింగ్ కోసం 10,000 అడుగుల దిగువకు దిగిరాగానే మళ్లీ విండో షేడ్స్‌ను మూసేయాల్సిందే. ఎమర్జెన్సీ కిటికీలకు మాత్రం ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు. విండోషేడ్స్ తెరిచి ఫొటోలు, వీడియోలు తీసే ప్రయాణికులు తగు పర్యావసనాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న విషయాన్ని వారికి తెలియజేయాలని విమానయాన సంస్థలకు డీజీసీఏ సూచించింది. సాధారణంగా ఏదైనా ప్రయాణికుల విమానం టేకాఫ్, ల్యాండింగ్ సమయాల్లో అగ్నిప్రమాదం లాంటివి ఏమైనా జరిగితే అత్యవసర పరిస్థితుల్లో తప్పించుకునేందుకు వీలుగా విండోషీట్స్‌ను తెరచే ఉంచుతారు.

## దేశంలో జిల్లాకో ఫోరెన్సిక్ ల్యాబ్

-మొదటిపేజీ తరువాయి

ఫోరెన్సిక్ సైన్స్ సేవల బలోపేతం' అంశంపై చండీగఢ్‌లోని ఫోరెన్సిక్ సెంట్రల్ సైన్స్ ల్యాబోరేటరీ కార్యాలయంలో రెండు రోజులపాటు ఆలిండియా సీఎఫఎసఎల్, ఎస్ఎఫఎల్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. శనివారం జరిగిన ముగింపు సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. "కొత్త క్రిమినల్ చట్టాల అమలులో భాగంగా న్యాయ ప్రక్రియను మరింత శాస్త్రీయంగా, పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చాలంటే ఫోరెన్సిక్ సేవలను ఇంకా బలోపేతం చేయడంతోపాటు ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది. నేర దర్యాప్తులో ఫోరెన్సిక్ అధికారులు శాస్త్రీయ ఆధారాలను సేకరించడాన్ని కొత్త చట్టాలు తప్పనిసరి చేశాయి. అయితే, చాలా రాష్ట్రాల్లో ఇప్పటికీ సరైన ఫోరెన్సిక్ మౌలిక సదుపాయాలు లేవు. శిక్షణ పొందిన శాస్త్రవేత్తల కొరత తీవ్రంగా ఉంది. దీంతో పెండింగ్ కేసులు న్యాయ ప్రక్రియను బలహీనపరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి రాష్ట్రంలో ఆధునిక పరికరాలతో కూడిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లను స్థాపించటం, నేరస్థుల వద్దే ఆధారాలను సేకరించేందుకు మొబైల్ యూనిట్ల ఏర్పాటుపై దృష్టిసారిస్తున్నాం. ఫోరెన్సిక్‌లో ఏఐ సాంకేతికతను ప్రవేశపెడుతున్నాం. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ప్రతి జిల్లాలో ఒక ప్రభావవంతమైన ఫోరెన్సిక్ యూనిట్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రాలకు ఆర్థిక, సాంకేతిక, శిక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని సంజయ్ వివరించారు. కాగా, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం భద్రత పెంచింది. ఇద్దరు నేతలకు టయోటా ల్యాండ్ క్రూజర్ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను కేటాయించింది.

## చేనేత వస్త్రాల్లో మరింత అందంగా..



-మొదటిపేజీ తరువాయి

సుందరీమణులు చేనేత వస్త్రాలు ధరించి.. యూరోప్, ఏషియా, ఓషియానా అందగత్తెలు గొల్లభామ చేనేత చీరలతో అలరించారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా, ఈ ప్రాంతానికే పరిమితమైన డిజైన్లతో ఈ వస్త్రాలు, చీరలను రూపొందించడం గమనార్హం. మిస్ ఇండియా నందిని గుప్తా ఎరుపు రంగు పటోలా లెహంగాలో తళుక్కుమన్నారు. తెలంగాణ చేనేత వస్త్రాలను ప్రపంచ సుందరి పోటీదారుల కోసం డిజైన్ చేయడం ఆనందంగా, గర్వంగా ఉందని డిజైనర్ అర్చనా కొచ్చారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో తెలంగాణ చేనేత చీరలు, ఇతర వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి దక్కుతుందని తెలిపారు. ఇక ఫ్యాషన్ ఫినాలే న్యాయనిర్ణేతలు, ఆహూతులు తెలంగాణ సంప్రదాయ డిజైన్లను చూసి ప్రశంసలు కురిపించారు. ప్రపంచ దేశాల సుందరీమణులు స్థానిక చేనేత వస్త్రాలను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించటం.. ఆ డిజైన్లకు, తయారీదారులకు మంచి గుర్తింపును, మార్కెటింగ్ అవకాశాలను ఇస్తుందని చెప్పారు. తెలంగాణ చేనేత వస్త్రాలతో సందడి చేసిన అనంతరం.. ప్రపంచ ప్రఖ్యాత డిజైనర్లు రూపొందించిన ఆధునిక ఫ్యాషన్ వస్త్రాలతో అందాల భామలు ర్యాంప్ వాక్ చేశారు. తెలంగాణ చేనేత వస్త్రాల కార్యక్రమానికి సంబంధించి.. ఏషియా-ఓషియానా విభాగంలో టాప్ మోడల్ ఫైనల్ టైటిల్‌ను భారత సుందరి నందినీ గుప్తా సాధించారు. యూరప్ విభాగంలో ఐర్లాండ్, అమెరికన్ విభాగంలో మార్టేనికూ, ఆఫ్రికన్ విభాగంలో నమీబియా అందగత్తెలు విజేతగా నిలిచారు.

# మనమంతా టీమిండియా

-మొదటిపేజీ తరువాయి

ఇదే తొలిసారి. ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రం ఏర్పాటయ్యేలా కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు. పహల్గాం ఉగ్ర దాడి లక్ష్యాల్లో జమ్మూకశ్మీర్‌లో పర్యాటకాన్ని దెబ్బ తీయడం కూడా ఉన్న నేపథ్యంలో ఈ సూచన ప్రాధాన్యం సంతరించుకుంది. "ప్రతి గ్రామం, ప్రతి మున్సిపాలిటీ, ప్రతి నగరం, ప్రతి రాష్ట్రమూ ప్రగతి సాధించడమే మన లక్ష్యం కావాలి. అప్పుడు దేశమంతా దానంతటదే వృద్ధి చెందుతుంది. గడువు లోపలే వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకుంటాం. ఆ దిశగా అభివృద్ధి పనుల వేగం మరింత పెంచుదాం. 140 కోట్ల పైచిలుకు భారతీయుల ఆకాంక్షలను నెరవేరుద్దాం" అని రాష్ట్రాలకు ప్రధాని పిలుపునిచ్చారు. భారత్‌లో పట్టణీకరణ శరవేగంగా సాగుతోందని గుర్తు చేశారు. కనుక నగరాలను సుస్థిరాభివృద్ధి, ఇన్నోవేషన్ల కలబోతగా, భవిష్యత్ అవసరాలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. "మహిళా శక్తికి మరింత ప్రాధాన్యమివ్వాలి. అప్పుడే మనమంతా ఆశించిన విధంగా దేశప్రగతి సాధ్యపడుతుంది. శ్రామిక శక్తిలో మహిళలను మరింతగా భాగస్వాములను చేయాలి. అందుకు అనుగుణంగా చట్టాలు, విధానాలను రూపొందించుకోవాలి" అని మోదీ చెప్పారు.

**కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 50 శాతం: సీఎంలు**

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 50 శాతానికి పెంచాలని తమిళనాడు, పంజాబ్ ముఖ్యమంత్రులు ఎం.కె.స్టాలిన్, భగవంత్ మాన్ డిమాండ్ చేశారు. "రాష్ట్రాలకు 41 శాతం వాటా ఇస్తామని మాటిచ్చారు. కానీ 33.16 శాతమే ఇస్తున్నారు. తమిళనాడు దేశంలోకెల్లా అత్యంత పట్టణీకరణ చెందిన రాష్ట్రం. అమృత్ 2.0 పథకం కింద రాష్ట్రానికి ప్రత్యేక పట్టణీకరణ మిషన్‌ను మంజూరు చేయాలని ఎప్పటినుంచో కోరుతున్నాం.
నమామి గంగ తరహాలో తమిళనాడులోని కావేరీ, వైగై తదితర నదుల ప్రక్షాళనకు ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేయాలి" అని స్టాలిన్ కోరారు. ఆ ప్రాజెక్టులకు పేర్లను ఇంగ్లిష్లోనే పెట్టాలన్నారు. పంజాబ్‌లో పాకిస్తాన్‌ను ఆనుకుని ఉండే ఆరు సరిహద్దు జిల్లాలకు ప్రత్యేక పారిశ్రామిక ప్యాకేజీ అందించాలని కేంద్రానికి మాన్ విజ్ఞప్తి చేశారు. సరిహద్దు ప్రాంతాల రైతులకు ఇస్తున్న ఎకరాకు రూ.10 వేల పరిహారాన్ని రూ.30 వేలకు పెంచాలన్నారు. సిక్కిం, పశ్చిమబెంగాల్‌లోని సిలిగురిలను కలుపుతూ ప్రపంచస్థాయి జాతీయ రహదారి నిర్మించాల్సిన అవసరం చాలా ఉందని సిక్కిం సీఎం ప్రేంసింగ్ తమాంగ్ అన్నారు.

**విధాన అడ్డంకులు తొలగించాలన్నారు: సీఈఓ**

భేటీ వివరాలను నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రమణ్యం మీడియాకు వెల్లడించారు. "వ్యవసాయం, విద్య, వైద్య రంగాలపై మరింతగా దృష్టి సారించాలని రాష్ట్రాలకు ప్రధాని సూచించారు. పెట్టుబడులను మరింతగా ఆకర్షించాలని, తద్వారా ఇతోధికంగా ఉపాధి అవకాశాలను సృష్టించాలని, అందుకోసం విధానపరమైన అడ్డంకులను తొలగించుకోవాలని హితవు పలికారు" అని చెప్పారు. భేటీలో పాల్గొన్న సీఎంలు, నేతలు ఆపరేషన్ సిందూర్‌ను ముక్తకంఠంతో సమర్థించారన్నారు.

**జైరాంతో కాంగ్రెస్‌కే చేటు: బీజేపీ**

నీతి ఆయోగ్ ఓ 'అయోగ్య' (అసమర్థ) సంస్థ అన్న కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శలపై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్‌కే చేటు చేసే వివాదాలను సృష్టించడం ఆయన నైజమని ఎద్దేవా చేసింది. కాంగ్రెస్‌ను జైరాం భూస్థాపితం చేయడం ఖాయమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షానవాజ్ హుస్సేన్ జోస్యం చెప్పారు.

**నవ్వుల్ పువ్వుల్**


ఆయోగ్ భేటీలో సరదా సన్నివేశాలు
ప్రధాని, ముఖ్యమంత్రుల నడుమ పలు సరదా సన్నివేశాలకు నీతి ఆయోగ్ భేటీ వేదికైంది. సమావేశం ముగిశాక రేవంత్‌రెడ్డి, స్టాలిన్ తదితరులతో మోదీ సరదా సంభాషణలు జరిపారు. నవ్వుతూ, వారిని నవ్విస్తూ కన్పించారు. భగవంత్ మాన్ (పంజాబ్), హేమంత్ సోరెన్ (జార?ండ్), కొన్రాడ్ సంగ్మా (నాగాలాండ్) తదితరులు మోదీతో చాలాసేపటిదాకా కరచాలనం చేస్తూ కన్పించారు. వారితో ప్రధాని సరదాగా మాట్లాడారు. ఈ సందర్భంగా నేతలంతా తేనీరు సేవిస్తూ ఉల్లాసంగా గడిపారు.

## 200 మంది ఉగ్రవాదుల్ని లేపేశారు..

# మహిళా పైలట్లకు బిగ్ సెల్యూట్!

పహల్గాం దాడితో అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్‌తో గట్టిగా బుద్ధి చెప్పింది భారత్. 9 ఉగ్రస్థావరాలపై అటాక్ చేసి 100 మందికి పైగా టెర్రరిస్టులను మట్టుబెట్టింది. ఆ తర్వాత ఎదురుదాడికి దిగిన పాకిస్థాన్‌కు మూడు చెరువుల నీళ్లు తాగించారు మన సైనికులు. డ్రోన్లు, క్షిపణులతో పాక్ ఆర్మీ పోస్టులు, ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేశారు. దీంతో భయపడ్డ పాక్.. కాల్పులు ఆపండి మహాప్రభో అంటూ కాళ్ల బేరానికి వచ్చింది. ఇప్పుడు ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు తగ్గుముఖం పట్టాయి. దీంతో ఆపరేషన్ సిందూర్ ముగిసిందని చాలా మంది అనుకుంటున్నారు. అయితే మన సైనికుల వీరగాథలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. మే 7వ తేదీన జరిపిన దాడిలో భారత మహిళా పైలట్లు ఏకంగా 200 మందికి పైగా టెర్రరిస్టులను లేపేశారని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. వీరిలో 170 మంది టెర్రరిస్టులు, 42 మంది శత్రుదేశ సైనికులు ఉన్నట్లు స్పష్టం చేశాయి.

**వారిదే ప్రధాన పాత్ర!**



పాకిస్థాన్‌లోని కీలక ఉగ్రస్థావరాలు ముఖ్యంగా బహవల్‌పూర్‌లోని జైషే మహ్మద్ టెర్రర్ క్యాంప్ పూర్తిగా ధ్వంసమైందని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఉగ్రవాది మౌలానా మసూద్ అజహర్ కుటుంబంలోని చాలా మంది హతమయ్యారని పేర్కొంది. ఈ వైమానిక దాడుల్లో భారత మహిళా పైలట్లు కీలక పాత్ర పోషించారని వివరించింది. బ్రహ్మోస్ క్షిపణులు అద్భుతంగా పని చేశాయని స్పష్టం చేసింది. మే 7న జరిపిన దాడులతో పాటు మే 9, 10 తేదీల్లో పాకిస్థాన్‌లోని సర్గోదా, రహీం యార్ ఖాన్, నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌లపై జరిపిన దాడుల్లోనూ భారత మహిళా పైలట్ల పాత్ర ఎంతో కీలకమని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. దీంతో మహిళా పైలట్ల మీద ప్రశంసల జల్లులు కురుస్తున్నాయి. వారికి బిగ్ సెల్యూట్ అని సోషల్ మీడియాలో నెటిజన్స్ అంటున్నారు. ఇదీ ఇండియా పవర్ అని కామెంట్స్ చేస్తున్నారు. కాగా, ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని అధికారిక వర్గాలు చెప్పాయి. భద్రతా బలగాలు ఇంకా హైఅలర్ట్‌లో ఉన్నాయని వెల్లడించాయి.

# ట్రంప్.. మరో షాక్...

## 788 మంది భారతీయ విద్యార్థుల పరిస్థితేలంటి?

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్-హార్వర్డ్ యూనివర్సిటీ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత ఆగే సంకేతాలు కనిపించడం లేదు. ఇంతలో, ట్రంప్ ప్రభుత్వం ఒక షాకింగ్ నిర్ణయం తీసుకుంది. విదేశీ విద్యార్థులు ప్రస్తుతానికి హార్వర్డ్‌లో ప్రవేశం పొందలేరు. విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థుల ప్రవేశాన్ని నిలిపివేసిస్తూ ట్రంప్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. దీంతో భారతదేశం తోపాటు ప్రపంచంలోని ఇతర దేశాల విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టి నోయెమ్, ఈ మేరకు హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి లేఖను పంపారని న్యూయార్క్ టైమ్స్ ఈ వార్తను అందించింది. "హార్వర్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థి, విద్యా మార్పిడి ప్రవేశ కార్యక్రమం గుర్తింపు రద్దు చేస్తున్నట్లు తెలియజేయడానికి లేఖ వ్రాస్తున్నాను, ఇది వెంటనే అమలులోకి వస్తుంది" అని నోయెమ్ లేఖలో రాశారు.హార్వర్డ్ అధికారిక రికార్డుల ప్రకారం, ప్రతి సంవత్సరం 500 నుండి 800 మంది భారతీయ విద్యార్థులు ఇక్కడ ప్రవేశం పొందుతున్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచం నలుమూలల నుండి దాదాపు 6,800 మంది విద్యార్థులు ఇక్కడికి వస్తారు. ఈ సంవత్సరం 788 మంది భారతీయ విద్యార్థులు ప్రవేశం పొందారు. ఇప్పుడు అలాంటి పరిస్థితిలో, ఈ విద్యార్థుల సమస్యలు పెరగబోతున్నాయి. విదేశీ విద్యార్థులు వేరే సంస్థలో అడ్మిషన్ తీసుకోవాలని లేదా అమెరికాలో వారి చట్టపరమైన హోదాను కోల్పోవాలని కోరారు. అందువల్ల, భారతీయ విద్యార్థులు మరొక సంస్థలో ప్రవేశం పొందే అవకాశం ఉంటుంది. వారు అలా చేయకపోతే, వారు అమెరికా వదిలి వెళ్ళవలసి రావచ్చు.హార్వర్డ్‌లో ప్రస్తుత సెమిస్టర్ పూర్తి చేసిన విద్యార్థులకు మాత్రం ఒక ఉపశమన



వార్త. వారు తమ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగలుగుతారు. హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం కార్యదర్శి క్రిస్టి నోయెమ్ తన లేఖలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. ట్రంప్ ప్రభుత్వం చేసిన మార్పు 2025-26 విద్యా సంవత్సరం నుండి అమలు చేయడం జరుగుతుందని ఆయన రాశారు.డొనాల్డ్ ట్రంప్-హార్వర్డ్ మధ్య వివాదం నెలకొంది. ట్రంప్ పరిపాలన తన సొంత కోరికల ప్రకారం విశ్వవిద్యాలయాన్ని నడపాలని కోరుకుం టుంది. కానీ హార్వర్డ్ దీనికి పూర్తిగా సిద్ధంగా లేదు. యూదు లపై ద్వేషాన్ని ఆపడంలో హార్వర్డ్ విఫలమైందని ట్రంప్ ఆరో పించారు. యూదు విద్యార్థులు, ప్రొఫెసర్లపై వివక్ష ఉందని ట్రంప్ సర్కార్ ఆరోపించింది. ఇప్పుడు విదేశీ విద్యార్థుల విషయంలో ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విశ్వవి ద్యాలయంపై పెరుగుతున్న ఒత్తిడి ఇదే అనిపిస్తుందంటున్నారు నిపుణులు.

## రాహుల్ గాంధీపై నాన్ బెయిలబుల్ వారెంట్

చైబాసా

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి పరువు నష్టం కేసులో జార?ండ్ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. జూన్ 26వ తేదీన స్వయంగా న్యాయస్థానంలో హాజరు కావాలని ఆదేశించింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ రాహుల్ లాయర్ చేసిన వినతిని తోసిపుచ్చింది. 2018లో కాంగ్రెస్ ప్లీనరీ సమావేశంలో అప్పటి బీజేపీ చీఫ్ అమిత్ షాకు వ్యతిరేకంగా రాహుల్..'హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు సైతం బీజేపీ అధ్యక్షుడవుతారు'అంటూ వ్యాఖ్యానించారు. దీంతో రాహుల్ గాంధీ బీజేపీ కార్యకర్తలందరి మనోభావాలను దెబ్బతీశారంటూ ఆ పార్టీ నేత ప్రతాప్ కటియార్ చైబాసాలోని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశారు. జార?ండ్ హైకోర్టు ఆదేశాల మేరకు ఎంపీ/ఎమ్మెల్యేలపై కేసులను విచారించే ప్రత్యేక న్యాయస్థానానికి ఈ పిటిషన్ బదిలీ అయ్యింది. విచారణ చేపట్టిన మేజిస్ట్రేట్ రాహుల్ గాంధీకి పలుమార్లు సమన్లు పంపారు. వీటిని ఆయన పట్టించుకోకపోవడంతో బెయిలబుల్ వారెంట్లు జారీ చేశారు. దీంతో, రాహుల్ స్టే కోసం జార?ండ్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను 2024 మార్చిలో న్యాయస్థానం కొట్టివేసింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ వేసిన పిటిషన్‌ను సైతం చైబాసా కోర్టు తిరస్కరించింది. తాజాగా, మరింత కఠినమైన నాన్ బెయిలబుల్ వారెంట్లు పంపింది

## కొలీజియంలోకి జస్టిస్ నాగరత్న

-మొదటిపేజీ తరువాయి

జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకా శుక్రవారం పదవీవిమరణ చేయడంతో ఆ స్థానం ఖాళీ అయింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఐదో సీనియర్ మోస్ట్ జడ్జి అయిన జస్టిస్ నాగరత్న మే 25వ తేదీ నుంచి అధికారికంగా సుప్రీంకోర్టు కొలీజియంలో కొనసాగనున్నారు. 2027 అక్టోబర్ 29వ తేదీదాకా ఆమె ఈ కొలీజియంలో కొనసాగుతారు. ఈలోపు అంటే 2027 సెప్టెంబర్ 23వ తేదీన అత్యంత సీనియర్ మోస్ట్ జడ్జి అర్హతతో ఆమె సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టే అవకాశముంది. ఈమె 1989లో ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించిన మాజీ సీజేఐ జస్టిస్ ఇ. సీతారామయ్య వెంకటరామయ్య కుమార్తె. జస్టిస్ నాగరత్న చేరికతో కొలీజియం సభ్యుల సంఖ్య ఐదుకు పెరగనుంది. ంఇప్పటికే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ జేకే మహేశ్వరి ఇందులో సభ్యులుగా ఉన్నారు. సోమవారం సీజేఐ కొలీజియంను సమావేశపరిచి సుప్రీంకోర్టులో, హైకోర్టులో ఖాళీలపై వివరాలు వెల్లడించనున్నట్లు సుప్రీంకోర్టు వర్గాలు తెలిపాయి. జస్టిస్ అభయ్ ఎస్.ఓకా రిటైర్ అయ్యాక సుప్రీంకోర్టులో మూడు జడ్జీ పోస్టులు ఖాళీ అయ్యాయి. 1993లో కొత్తగా మనుగడలోకి వచ్చిన సుప్రీంకోర్టు కొలీజియం వ్యవస్థ ద్వారానే సుప్రీంకోర్టు, 25 హైకోర్టులకు జడ్జీల ఎంపిక, బదిలీ, పదోన్నతి ప్రక్రియలు కొనసాగుతున్నాయి.

## శరవేగంగా కోవిడ్ వ్యాప్తి.. ఆసుపత్రుల్లో హైఅలర్ట్

**న్యూఢిల్లీ:** దేశంలో కరోనావైరస్ మరోసారి విజృంభిస్తోంది. ఈసారి కొత్త ఉపరకాల రూపంలో కలకలం సృష్టిస్తోంది. దాదాపు.. ఏడాదిన్నర తర్వాత పలు రాష్ట్రాల్లో కోవిడ్-19 కేసులు నమోదు అవుతున్నాయి. మరీ ముఖ్యంగా గ్రామీణేతర ప్రాంతాల్లోనే వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంటోంది. జేఎన్.1 వేరియంట్ నుంచి పుట్టుకొచ్చిన మరో కొత్త వేరియెంట్లు ఎల్ఎఫ్.7, ఎన్బీ.1.8.1 భారత్‌లో వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం శనివారం ఈ విషయాన్ని వెల్లడించింది. ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కొత్త కేసులు వెలుగు చూశాయి. ఏడాదిన్నర తర్వాత ఒడిషాలో కొత్త కేసు నమోదుకాగా, రాజధాని రీజియన్‌లో మూడేళ్ల తర్వాత కోవిడ్ కేసులు అత్యధికంగా నమోదు అయ్యాయి. కేరళలో గరిష్టంగా 273 కోవిడ్ కేసులు, కర్ణాటకలో 35, మహారాష్ట్ర ముంబైలో 95.. థానేలో 10, ఢిల్లీలో 23 కేసులు రికార్డయ్యాయి.
తెలుగు రాష్ట్రాలు సహా పలు రాష్ట్రాల్లో వైరస్ లక్షణాలతో ఆస్పత్రుల్లో బాధితులు చేరుతున్నప్పటికీ.. అధికారికంగా మాత్రం ప్రకటించడం లేదు. అదే సమయంలో కేంద్ర ఆరోగ్య శాఖ కూడా రాష్ట్రాల కోసం ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) జేఎన్.1 వేరియంట్‌ను దాని వేగవంతమైన వ్యాప్తి కారణంగా 'వేరియంట్ ఆఫ్ ఇంటరెస్ట్'గా వర్గీకరించింది. కానీ, ప్రస్తుతానికి 'వేరియంట్ ఆఫ్ కన్సర్న్'గా ప్రకటించలేదు. మరోవైపు.. శరవేగంగా కొత్త వేరియెంట్లు వ్యాప్తిస్తున్నప్పటికీ.. లక్షణాలు మాత్రం స్వలంగానే ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ కొత్త ఉపరకాల లక్షణాలు సాధారణంగా గతంలోని ఒమిక్రాన్ వేరియంట్ల మాదిరిగానే ఉంటున్నాయి. గొంతు నొప్పి, తేలికపాటి దగ్గు, అలసట, జ్వరం వంటివి ప్రధాన లక్షణాలుగా కన్పిస్తున్నాయి. అయితే, డెల్టా వంటి పాత వేరియంట్లలో కనిపించిన రుచి, వాసన కోల్పోవడం వంటి లక్షణాలు ఈ కొత్త వేరియంట్ల బారిన పడినవారిలో అంతగా కనిపించడం లేదని వైద్యులు చెబుతున్నారు.

**భారీగా పెరుగుతున్న కరోనా, దేశంలో పెలైఅలర్ట్..**

**ఆస్పత్రుల్లో హైఅలర్ట్**

కోవిడ్ బారినవారు నాలుగు రోజుల్లోనే కోలుకుంటున్నారని ఇండియా కరోనా ట్రాకర్ ఆధారంగా.. ఇండియా టుడే తన కథనంలో పేర్కొంది. హైదరాబాద్(తెలంగాణ)లో పేషెంట్ల కోసం ముందస్తుగా పరీక్ష చేసుకున్న ఓ వైద్యుడికి కోవిడ్ నిర్ధారణ అయ్యింది. అయితే ఆయన స్వల్ప జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత వైరస్ వ్యాప్తితో లక్షణాలు స్వలంగా ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నప్పటికీ.. ముందస్తు జాగ్రత్తగా పలు రాష్ట్రాలు కోవిడ్-19 మార్గదర్శకాలను జారీ చేశాయి. మాస్క్ తప్పనిసరిగా ధరించాలని, శుభ్రత.. వ్యక్తిగత శుభ్రత పాటించాలని కోరుతున్నాయి. ఆసుపత్రులలో పడకలు, ఆక్సిజన్, మందులతో ప్రత్యేక వార్డులను సిద్ధం చేస్తున్నాయి. అయితే అధిక ప్రమాదం ఉన్నవారు (వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు) బూస్టర్ డోస్ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## చల్లని కబురు..




తిరువనంతపురం: దేశంలో రైతులకు శుభవార్త. నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయి. సాధారణం కన్నా 8 రోజులు ముందుగానే ఈ రుతుపవనాలు కేరళలో ప్రవేశించాయి. ఈ మేరకు వాతావరణ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. రుతు పవనాల ఎఫెక్ట్‌తో కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక, నైరుతి రుతుపవనాలు రాకతో ఇప్పటికే కేరళలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. కేరళ రాజధాని తిరువనంతపురంలో గాలి వాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలుల కారణంగా భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. దీంతో, మున్సిపల్ శాఖ సిబ్బంది రోడ్లపై విరిగిపడిన చెట్లను తొలగిస్తున్నారు.

# పొగాకు రైతుల సాగుగాథలు

బాపట్ల జిల్లా పర్చూరు మండలం వీరన్నపాలెంలో కౌలు రైతు ఆత్మహత్య! ముప్పాళ్ళ మండలంలో కౌలు రైతు ఆత్మహత్య! ఇంకొల్లు మండలంలో కౌలు రైతు ఆత్మహత్యాయత్నం! ఎందుకిలా జరుగుతున్నది? సుమారు 90 నుండి 150 రోజులు కష్టపడి ఆటుపోట్లను తట్టుకొని పొగాకు పంట సాగు చేశారు. పంట వేయక ముందు వివిధ కంపెనీల ప్రతినిధులు గ్రామాల్లో రైతాంగం చుట్టూ తిరిగి 'నల్ల బర్లీ వేయండి. గత సంవత్సరం రేటు ఇంకా రెండు మూడు సంవత్సరాలు ఉంటుంది' అని ప్రోత్సహించారు. ఫలితంగా పొగాకుతో పాటు ఇతర పంటలు వేసే రైతులు అన్నీ వదులుకొని నల్ల బర్లీ పొగాకు ఒక్కటే సాగు చేశారు. గత సంవత్సరం రేటు సంగతి పైవాడికెరుక. ఇప్పుడు ఎంతో కొంతకు కొనే నాథుడు కూడా లేడు. పైగా సంవత్సరం అంతా ప్రైవేటు వ్యక్తుల దగ్గర అప్పులు, ఎరువులు, పురుగు మందుల షాపుల నుంచి అరువు తెచ్చిన రైతులు, కౌలు రైతులు చివరకు కూలీలకు డబ్బులు ఇవ్వలేకపోతున్నారు. భార్య మెడలో బంగారాన్ని తాకట్టు పెట్టినా సరిపోక అప్పుల వారికి మొహం చూపించలేకపోతున్నారు. కనీసం అడుగు ఆకు అమ్మయినా కూలి డబ్బులు తీరుద్దామంటే అది కూడా దారుణంగా ఉంది. అడుగు ఆకు కోస్తే క్వింటాకి రూ.5000 కూలి అయింది. ఆ అడుగు ఆకుని కంపెనీకి అమ్ముకుంటే కేవలం రూ.2500 వచ్చిందంటే పంట పండించడానికి అయిన ఖర్చు, కూలి కలిపి రాకపోయినా.. కూలీలకైన ఖర్చన్నా రాకపోగా అందులో సగం డబ్బ మాత్రమే వచ్చింది. వీటన్నింటి వలన ప్రత్యేకించి కౌలు రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. నేడు రైతులు కేజీ పొగాకును 30 రూపాయల నుండి 100 రూపాయల వరకు అమ్ముకుంటున్నారు. ఆ కేజీ పొగాకుతో కనీసం 1250 నుండి 2000 సిగరెట్ల వరకూ తయారవుతాయి. అంటే ఒక్కొక్క సిగరెట్టుకు 0.7 గ్రాముల నుండి ఒక గ్రాము వరకు పొగాకు వాడతారు. ఈ క్రమంలో కొంత వృథా అయినా తక్కువలో తక్కువగా సగటున 1250 సిగరెట్లు వస్తాయి. ఒక్కొక్క సిగరెట్టు సగటు ధర రూ.10 అనుకున్నా కేజీ పొగాకు ద్వారా ఉత్పత్తి అయిన 1250 సిగరెట్లను అమ్ముకుంటే కంపెనీకి రూ.12,500 వస్తాయి. రైతులకు పొగాకు కోసం రూ.30 నుండి రూ.100 పోతాయి. అంటే ఒక కేజీ పొగాకు ద్వారా రూ.12,400 ఆదాయం కంపెనీకి వస్తుంది. ఒక ఎకరాకు 12 నుండి 13 క్వింటాళ్ళు పొగాకు పండిస్తున్నారు. అంటే క్వింటా రూ.10,000 చొప్పున 12 క్వింటాళ్లు కొన్నారనుకుంటే రైతులకు రూ.1,20,000 వస్తున్నాయి. రైతు పెట్టిన పెట్టుబడి ఎకరాకు రూ.లక్ష 50 వేలు అయ్యింది. దాంతో రైతుకు ప్రతి ఎకరాకు రూ.30 వేల నుండి రూ.50 వేలు నష్టం వస్తుంది. అదే కంపెనీకి కేజీ పొగాకుతో చేసిన 1250 సిగరెట్లు అమ్ముకోవడం ద్వారా రూ.12,400 వస్తుంది. ఎకరా పొగాకు ద్వారా కంపెనీకి రూ.12 లక్షల 40 వేల ఆదాయం వస్తుంది. ఈ అంకెలు కొంచెం నమ్మడానికి కష్టంగా ఉంటుంది. కానీ ఐటిసి కంపెనీ అనేక వ్యాపారాలు చేస్తుంది. ఇంటర్నెట్‌లో లభించిన సమాచారం మేరకు 2024 సంవత్సరంలో కంపెనీ రూ.20 వేల 751 కోట్ల నికర లాభం పొందింది. ఆ కంపెనీకి రూ.91,826 కోట్ల విలువ గలిగిన స్థిరాస్తులున్నాయి. ఐటిసి కంపెనీ సీఈఓ జీతం నెలకు రూ.రెండు కోట్ల పైనే. అంటే



గంటకు రూ.10 లక్షలు జీతం. మన రైతు సంవత్సరం అంతా ఎండనకా వాననకా ఆరుగాలం కష్టపడి పనిచేసినా ఆయన గంట జీతం అంత కూడా సంపాదించలేకపోతున్నాడు.

క్యాడ్బరీ పరిస్థితి కూడా అలాగే వుంది. నేడు అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజలు కేజీ రూ.800 నుంచి రూ.900 రూపాయలు తక్కువ కాకుండా కొంటున్నారు. కానీ మన రాష్ట్రంలో మాండలిస్ కంపెనీ ఈ కోకో గింజలను కేవలం 450 రూపాయలకే కొంటున్నది. ఒక కేజీ కోకో గింజల నుంచి 800 గ్రాముల కోకో నిబ్స్ వస్తాయి. 400 నుండి 500 గ్రాముల కోకో లిక్విడ్ వస్తుంది. వంద గ్రాముల కోకో చాక్లెట్‌లో 70 గ్రాముల కోకో పదార్థాలుంటాయి. వంద గ్రాములు కోకో లిక్విడ్‌తో పది చాక్లెట్లు వస్తాయి. అలాగే మిల్క్ షేక్ అయితే 12 నుంచి 16 ముక్కలు వస్తాయి. చాక్లెట్లు ఒక కేజీకి సుమారుగా 150 ముక్కలు వస్తాయి. అంటే తక్కువలో తక్కువ కంపెనీకి రూ.16 వేలు వస్తాయి. కానీ రైతుకి ఇస్తున్నది కేజీకి రూ.450 మాత్రమే. అంటే రైతుకిచ్చిన దానికి అదనంగా 40 రెట్లు లాభం కంపెనీకి వస్తుంది. మాండలిస్ కంపెనీ 2022–2023లో రూ.1176 కోట్ల నికర లాభం పొందగా, 2023–2024లో రూ.2020 కోట్ల నికర లాభాలు సంపాదించింది. ఆ కంపెనీ కూడా రూ.5.76 లక్షల కోట్ల విలువ కలిగిన ఆస్తులున్నాయి. ఈ కంపెనీ షేర్ విలువ కూడా 64.14 డాలర్లకు పెరిగింది. ఈ మధ్య కాలంలో చాక్లెట్ల ధర 22 శాతం నుండి 30 శాతం వరకు పెంచారు. క్యాడ్బరీ కంపెనీ ఎమ్.డి స్థాయి అధికారుల జీతాలు నెలకు రూ.64 లక్షల నుండి రూ.96 లక్షల మధ్యలో ఉన్నాయి. అలాగే ఇతర ఉన్నతాధికారులు జీతాలు కూడా లక్షల్లో ఉన్నాయి. కానీ ఈ కంపెనీల లాభాలకు, స్థిరాస్తులకు, ఉన్నతాధికారుల జీతాలకు ముడి పదార్థమే మూలం. ఆ ముడి పదార్థం లేకపోతే కంపెనీ లేదు. లాభాలు లేవు. ఆస్తులు కూడా ఉండవు. కానీ ఆ ముడి పదార్థం పండించే రైతులు, కౌలు రైతులు అప్పుల పాలవుతున్నారు. వున్న కొద్దో గొప్పో ఆస్తులను కూడా అమ్ముకుంటున్నారు. చివరకు ఆత్మాభిమానంతో అప్పుల వారికి మొహం చూపించలేక అప్పులు తలుచుకుంటూ ఆప్తులను, భార్యాబిడ్డలను కూడా వదులుకొని ఆత్మహత్య చేసుకుంటున్నారు. కంపెనీలు లాభాలతో కోట్లకు పడగలెత్తుతుంటే, పొగాకు సాగు చేసిన కౌలు రైతులు చివరకు ఆత్మహత్య చేసుకుని పాడెక్కుతున్నారు. డబ్బు కంటే విలువైనది ప్రాణం. ఆ విలువైన ప్రాణాన్ని రైతాంగం బలవంతంగా తీసుకుంటున్నారంటే ప్రభుత్వం, ప్రజలు, సభ్యసమాజం ఆలోచించాలి. మీటింగ్‌కి వెళ్తున్నారా అని వెటకారంగా పలకరించటం, మంత్రిగారి దగ్గరికి వెళుతున్నారా, కొనుగోలు ఇంకా ఆలస్యం అవుతుందని హెచ్చరించడం, ధర్నా చేస్తున్నారా ధర ఇంకా పడిపోతుందని బ్లాక్ మెయిల్ చేయడం. ఇదీ కంపెనీల ప్రతినిధులు గ్రామాల్లో చేసే ప్రచారం. వాస్తవంగా పొగాకు వేయమని ప్రజల్లో ప్రచారం చేసి, నమ్మించి మోసం చేసినందుకు ఈ కంపెనీ ప్రతినిధుల మీద ఐపిసి సెక్షన్ 426 కేసు పెట్టాలి. ఇప్పటికీ వ్యవసాయ శాఖ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి సమక్షంలో కంపెనీల ప్రతినిధులు పలు దఫాలు చర్చించారు. అయినా కొనుగోలు వేగవంతం కాలేదు. మంత్రులు చర్చల తర్వాత కూడా కంపెనీలు కొనుగోళ్లు చేయటం లేదు. అంటే ప్రభుత్వ పాత్రని అనుమానించాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో... పొగాకు సాగుదారులందరూ ఐక్యంగా పోరాడితేనే పంటకు గత సంవత్సరం ధర సాధించగలుగుతారు.

# వైపరీత్యాల పట్ల అవగాహన ఏదీ

ప్రపంచ వ్యాప్తంగా అనేకానేక దేశాల్లో ప్రకృతి విపత్తులు విరుచుకు పడుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సృష్టిస్తున్న విధ్వంసంతో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ఈ సందర్భంగా ప్రకృతి వైపరీత్యాల గురించి అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరం. సహజ, సాంస్కృతిక వనరులను ధ్వంసం చేసి, ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే ప్రకృతి పరమైన, మానవ ప్రేరేపిత ఆకస్మిక సంఘటనలే విపత్తులు. విపత్తు అనే పదాన్ని ఇంగ్లిష్‌లో "డిజాస్టర్" అంటారు. ఇది మధ్యయుగం నాటి ఫ్రెంచి పదం. దీన్ని మూడు భాషా పదజాలల నుంచి గ్రహించారు. అవి..1) డస్ (ఐబం), ఆస్టర్ (ఘార్‌వతీ) అనే గ్రీకు పదాలు. 2) డెస్ (ఐవం), ఆస్ట్రే (ఘార్‌తీవ) అనే ఫ్రెంచ్ పదాలు. 3) డిస్ (ఐబం), ఆస్ట్రో (ఘార్‌తీశీ) అనే లాటిన్ పదాలు గ్రీకు, లాటిన్ భాషల్లో డిజాస్టర్ అంటే 'దుష్ట నక్షత్రం' అని అర్థం. అలానే విపత్తు అనే పదాన్ని ఇంగ్లీషులో డిసాస్టర్ అంటారు. విపత్తు ఒక భయంకర పరిస్థితి. దీంతో సాధారణ జనజీవనం అస్తవ్యస్తం అవుతుంది. పర్యావరణ స్థితి విచ్ఛిన్నం అవుతుంది. భూమి కంపించడం వలన జరిగే వైపరీత్యాలు, జల వైపరీత్యాలు, వడగాలి, అగ్ని, మహమ్మారులు, అంతరిక్షం ప్రభావాల సంఘటనలు , సౌర జ్వాలలు తదితరాల ప్రభావం మానవ జీవితంపై అధికంగా ఉంది. విపత్తుల వల్ల 1) వరదలు – 30 శాతంబీ 2) తుపానులు – 21 శాతంబీ 3) కరవు– 19 శాతంబీ 4) మహమ్మారి వ్యాధులు – 15 శాతంబీ 5) భూకంపాలు, సునామీలు – 8 శాతంబీ 6) భూతాపాలు – 4 శాతం 7) హిమపాతాలు – 11 శాతంబీ 8) అగ్ని పర్వతాలు – 1 శాతంబీ 9) కీటక దాడులు – 1 శాతంబీ నష్టాలు సంభవిస్తున్నాయి. డిజాస్టర్ నాలెడ్జ నెట్‌వర్క్ (ఐడీకేఎన్) రిపోర్టుల ప్రకారం దేశంలోని 29 రాష్ట్రాలు ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఏదో ఒక విపత్తుకు తరచు గురవు తున్నాయి. దేశంలోని తీర ప్రాంతాలు విశిష్టమైన ప్రకృతి వనరులు, జీవ వైవిధ్యానికి ప్రతీకలు. దేశ ఆర్థిక పరిపుష్టి లో విశేషమైన పాత్ర ఇవి పోషిస్తున్నాయి. 13 రాష్ట్రాల్లోని 84 జిల్లాలు, అండమాన్, లక్షద్వీప్ కేంద్రపాలిత రాష్ట్రాల్లో 7,500 కిలోమీటర్లలో సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. వీటిల్లో గుజరాత్ (1,214 కి.మీ.) ఆంధ్రప్రదేశ్‌లో (7 కి.మీ.) రాష్ట్రాల్లో అధికంగా తీరప్రాంతం ఉంది. అడవులు, చిత్తడి నేలలు, పగడపు దిబ్బలు, ఉప్పునీటి కయ్యలు, ఇసుక నేలలు వంటి జీవ వైవిధ్యం తీరప్రాంతాల్లో ఉంటాయి. తీరంలోని యాభై కిలోమీటర్ల లోపు రమారమి ముప్పై కోట్ల మేర జనాభా నివసిస్తుంది. పర్యావరణ సమ తుల్యత లోపించడం



వాతావరణంలో పెనుమార్పులు విపత్తులకు మూలకారణం పెరుగుతున్న జనాభా, నగరీకరణ, తీర నియంత్రణ, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలు, పరిశ్రమలు, ఓడరేవుల విస్తరణ తీరంలోని జీవ వైవిధ్యానికి చేటు తెస్తూ సమస్యకు ఆజ్యం పోస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు నివేదికల ప్రకారం.. భారత దేశంలో సంభవించే విపత్తుల వల్ల జాతీయ ఆదాయంలో ఏటా 2.25 శాతం నష్టం వాటిల్లుతోంది. 'ప్రివెన్షన్ వెబ్ స్టాటిటిక్స్' రిపోర్ట్ ప్రకారం భారత్‌లో గత మూడున్నర దశాబ్దాలుగా దాదాపు 431 రకాల విపత్తులు సంభవించాయి. వీటి ద్వారా సుమారు 1,43,000 మంది ప్రాణాలు కోల్పోయారు. 15 కోట్ల మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వీటి ప్రభావానికి గురయ్యారు. సుమారు 4,800 కోట్ల అమెరికన్ డాలర్ల ఆస్తి నష్టం జరిగింది. ఇవి ఇప్పటి వరకు భారత దేశంలో, ప్రపంచంలోనూ ఎక్కువసార్లు సంభవించిన విపత్తు 'వరదలు'గా ఆ నివేదిక పేర్కొంది. ప్రకృతి విపత్తులకు భారత్ అంతులేని మూల్యాన్ని చెల్లిస్తోందని ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక కుండ బద్దలు కొట్టింది. 20 ఏళ్లలో విపత్తుల కారణంగా దేశం 7,950 కోట్ల డాలర్లు (సుమారు రూ.5.91 లక్షల కోట్లు) నష్టపోయింది. ఆర్థిక నష్టాలు, పేదరికం, విపత్తుల పేరిట 2017 ఆగస్టులో విడుదలైన నివేదికలో వివిధ, దేశాలు నష్టపోయిన మొత్తం విలువ 2.9 లక్షల కోట్ల డాలర్లుగా తేలింది. అంతకుముందు 20 ఏళ్ల వ్యవధి నష్టాల కంటే ఇది రెట్టింపు. ప్రపంచంలో విపత్తుల వల్ల నష్ట పోతున్న వారి సంఖ్య 211 మిలియన్లు. విపత్తుల వల్ల భారత్ లో ఏటా 10 బిలియన్ల డాలర్ల నష్టం నష్టం జరుగుతోంది. మన దేశంలో భూమి వరదలకు 12శాతం ( 8శాతం) గురవుతోంది. ప్రకృతి వైపరీత్యాలైన తుపానులు, వరదల్లో మృతి చెందేవారికి ప్రభుత్వం నష్ట పరిహారాన్ని ఇస్తోంది. ప్రకృతి విపత్తులు, బీమా రంగం తన పాత్రను ఎక్కువగా నిర్వర్తిస్తూ వస్తూంది. ఈ రంగం, కొన్ని నష్టాలను పూడ్చుటకు తనవంతు సహాయ సహకారాలను అందిస్తుంది. హరికేన్లు, దావాలనాలు, ఇతర విపత్తులు సంభవించి నపుడు ఈ బీమా రంగం సాయం అందిస్తున్నది. పర్యావరణ పరిరక్షణ చట్టం(1986)కు అనుబంధంగా తీరప్రాంత నియంత్రణ నిబంధనల పేరిట కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్ జెడ్) నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం 1991లో అమలులోకి తీసుకొచ్చింది. కొన్ని వర్గాల కార్యకలాపాలకు అడ్డుగా ఉన్న ఈ నిబంధనలను అమలు చేయడంలో ప్రభుత్వ వ్యవస్థ విఫలమయింది. విదేశీ నౌకా నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ, అటవీ, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక చట్టాలు తీరప్రాంత పరిరక్షణతో ముడివడి ఉన్నాయి. 1991 నాటి నిబంధనల్లో తీరాన్ని మూడు విభాగాలు(సీఆర్ జెడ్–1,2,3)గా విభజించారు. ఆయా ప్రాంతాల్లో వివిధ నిర్మాణాలు చేపట్టడానికి నియంత్రణలు విధించాలి. అయితే పలు ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు చేపట్టే కార్యక్రమాలకు ఇవి అడ్డుగా ఉన్నాయన్న ఉద్దేశంతో నిబంధనల్లో సవరణలు తీసుకొచ్చారు తప్పితే, నోటిఫికేషన్ లక్ష్యాలకు అనుగుణంగా నియమాలు అమలు చేసిన దాఖలాలు తక్కువ. సీఆర్జెడ్ నిబంధనలను 1991 మధ్య కాలంలో 12సార్లు సవరించి వివిధ అభివృద్ధి కార్యక్రమాల విస్తరణకు అనుమతించారు. ఈ నోటిఫికేషన్ అమలుచేయాల్సిన బాధ్యత రాష్ట్రాలదే. అయితే నిబంధనల అన్ని అభివృద్ధి కార్యక్రమాలను నియంత్రించి ప్రకృతి వ్యవస్థలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అభివృద్ధి పనుల పేరిట మడ అడవులు, హరితవనాలను విచ్చలవిడిగా ధ్వంసం చేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు నిధులు, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విపత్తుల యాజమాన్య ప్రణాళికల అమలు మొక్కుబడిగా మారాయి. 2011 నుంచి కేంద్ర ప్రభుత్వ సాయంతో నిర్మించ తలపెట్టిన బహుళ ప్రయోజక దశాబ్దాల క్రితంనాటి తుపాను షెల్టర్లు పూర్తిగా శిథిలమయ్యాయి. ప్రకృతి వైపరీత్యాల నివారణకై, ప్రణాళికలను బడ్జెట్లో ప్రత్యేకంగా పొందుపరచాల్సిన అవసరం ఉంది. నష్టం అంచనాలో పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలను భాగ స్వాములను చేయాలి. ప్రకృతి వ్యవస్థలకు హాని కలగకుండా, గొలుసుకట్టు హరిత వనాల పెంపకానికి, మడ అడవుల పునరుద్ధరణకు ప్రత్యామ్నాయ వనీకరణ నిధులను సమకూర్చాలి. వైపరీత్యాలకు దారి తీయకుండా తీరప్రాంత వనరుల వినియోగం జరిగేలా చర్యలను ప్రభుత్వం ముమ్మరం చేయాలి. క్షేత్రస్థాయి నుంచి పైదాకా ప్రభుత్వ వ్యవస్థల స్పందన బట్టి బాధిత ప్రజలకు భవిష్యత్తులో విపత్తులను ఎదుర్కో గలమనే ధైర్యం కలిగించాలి.

## నాలుగేళ్ల 'అగ్నిపథ్' ౦౦ఎవరి కోసం?

భారత్‌కు ఏడు పొరుగు దేశాలతో భూ, సముద్ర సరిహద్దులున్నాయి. ఇవి వరుసగా 14,868 కిమీ, 7,000 కిమీ (మొత్తం 21,868 కిమీ). ఒక్క బంగ్లాదేశ్‌తోనే 4,026 కిమీ భూ సరిహద్దు ఉంది. వీటిలో చాలా వరకు కంచె గాని, బి.ఎస్.ఎఫ్ పహారా గాని లేదు. ఇక, పాకిస్తాన్‌తో 3,323 కిమీ సరిహద్దు ఉంది. భారత్‌కు పొరుగు దేశాలతో సత్సంబంధాలనేవి గతానికి సంబంధించినవి. సోవియట్ రష్యా పతనం తర్వాత, యుద్ధ పరిస్థితిలో భారత్‌కు ప్రత్యక్షంగా అండగా నిలిచే దేశం ప్రపంచంలో మరేదీ లేదు. పైగా దేశంలో సైన్యం వినియోగం పెరుగుతోంది! అంతే కాదు. త్రివిధ దళాలు ఒకేసారి యుద్ధంలో పాల్గొనడం అసాధ్యం. ఈ పరిస్థితుల్లో, సైన్యాన్ని బలహీనపరిచే ఒక ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టడం చాలా ప్రమాదకరం. ఈ చర్యను ఖండించాలి కూడా. భారత ఆర్మీ 12 లక్షల మంది సైనికులతో ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద సైనిక దళం. ప్రతి సంవత్సరం 55,000 మంది సైనిక సిబ్బంది పదవీ విరమణ చేస్తున్నారు. ప్రతి సంవత్సరం సగటున 60,000 మంది సైన్యంలోకి నియమితులవుతున్నారు. దేశంలోనే అతి పెద్ద ఉద్యోగ సంస్థ సైన్యం. భారత సైనికుల శారీరక, మానసిక బలం, వృత్తి నైపుణ్యాలు, క్రమశిక్షణ, సామర్థ్యం, దేశభక్తి, త్యాగాలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్నాయి. దీనికి కారణం అధిక–నాణ్యత, దీర్ఘకాలిక సైనిక శిక్షణా పద్ధతులు. ఆర్మీ లోని ఒక్కో సైనికుడు ఏడు సంవత్సరాల పాటు అత్యంత కఠినమైన శిక్షణ పొందుతాడు. శిక్షణలో విజయం సాధించిన వారిని యుద్ధ భూమిలో సైనికులకు సహాయకులుగా నియమిస్తారు. అక్కడ అవసరమైన అనుభవాన్ని గడించడానికి సైనికులను సహాయకులుగా నియమిస్తారు. అప్పుడు వారు నేరుగా యుద్ధంలో పాల్గొనవచ్చు. సైనికులకు ఇటువంటి సుదీర్ఘ శిక్షణ ఇవ్వడమనేది చాలా సాధారణమైన విషయం. 15 సంవత్సరాలపాటు సైన్యంలో సేవ చేసిన ఒక సైనికుడు ఉద్యోగ విరమణ చేసినప్పుడు 7 సంవత్సరాల శిక్షణతో కూడిన 15 సంవత్సరాల పని అనుభవమున్న సైనికుడిని ఆర్మీ కోల్పోతుంది. కఠోరమైన వ్యాయామం, క్రమశిక్షణ, సమతుల ఆహారం, అనుకూలమైన పని వాతావరణం, ఐక్యతా భావం, దేశం కోసం పని చేయాలనే మక్కువ వంటివన్నీ పౌర సమాజంలోని తోటివారితో పోలిస్తే రిటైర్మెంట్ సమయంలో ఆర్మీ జవాన్ శారీరక, మానసిక ఆరోగ్యంతో చురుకుగా వుంటాడు. 32 నుంచి 36 ఏళ్ల మధ్య సైనిక సిబ్బంది ఉద్యోగ విరమణ చేయాలనే నియమాన్ని దేశ తొలి రక్షణ దళాధిపతి, దివంగత బిపిన్ రావత్ వ్యతిరేకించారు. వీరిలా నైపుణ్యం, క్రమశిక్షణ కలిగిన మానవ వనరులను మరో 15 సంవత్సరాలు ఉపయోగించడం ఆర్మీకి ఎంతో ప్రయోజనకరమని ఆయన విశ్వసించారు. 62 సంవత్సరాల వయస్సులో ఉన్న ఒక సైనిక అధికారి ఆశించిన సామర్థ్యం, నాణ్యత, వేగంతో సేవలను అందించగలిగినప్పుడు 32–36 సంవత్సరాల మధ్య వయస్సుగల జవాన్ ఏ కారణం చేత ఆవిధంగా పనిచేయలేడనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. సైనిక సిబ్బంది ఉద్యోగ విరమణ వయస్సును 58 సంవత్సరాలకు పెంచాలని ఆయన ప్రభుత్వానికి లిఖితపూర్వక ప్రతిపాదనను సమర్పించారు. అయితే, సైనికుల రిటైర్మెంట్ వయస్సు, సైన్యం సగటు వయస్సు ఎంత ఉండాలనే దానిపై సైన్యంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. యుద్ధం ప్రజలకు హాని కలిగిస్తుంది. ఈ ప్రపంచం యుద్ధం నుండి విముక్తి పొందితే మంచిది. ప్రపంచంలో యుద్ధానికి, సైన్యానికి ఖర్చు చేసే భారీ మొత్తాన్ని ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించినట్లయితే ప్రపంచ ముఖచిత్రమే మారిపోతుంది. కానీ దాడి, దురాక్రమణ, యుద్ధం నిజమైనప్పుడు, దేశ ప్రయోజనాల కోసం సైన్యానికి డబ్బు కేటాయించేందుకు ఏ దేశమూ ఏమాత్రం వెనుకాడదు. సైన్యం సగటు వయస్సు తగ్గింపును, సైన్యం మీద చేసే ఖర్చు తగ్గింపును కారణంగా చూపించిన మోడీ ప్రభుత్వం 2022 నుండి 'లెఫ్టినెంట్' స్థాయి కంటే దిగువన ఉన్న అన్ని శాశ్వత పోస్టులకూ నియామకాలను నిలిపివేసింది. 'అగ్నిపథ్' ద్వారా మాత్రమే సైనిక నియామకాలు చేపట్టాలని నిర్ణయించింది. వాస్తవం ఏమిటంటే%ఔ%సైన్యానికి, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న ఈ అగ్నిపథ్ ప్రాజెక్టును ఉపసంహరించు కోవాలని, సైన్యంలో భారీ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ, వ్యక్తిగతంగా లేదా సమిష్టిగా ఒక ప్రజా ఉద్యమాన్ని నిర్మించడానికి%ఔ%వామపక్షాలు మినహా ఏ బిజెపి యేతర పార్టీ కూడా చొరవ తీసుకోలేదు. 17 నుండి 21 సంవత్సరాల మధ్య వయస్సుగల యువకులను 'అగ్నివీర్ ప్రాజెక్ట్' కింద 4 సంవత్సరాల పాటు సైన్యంలో నియమించుకుంటారు. ఏటా 46,000 మంది అగ్నివీర్ సిబ్బందిని నియమిస్తారు. వీరిలో 75 శాతం మంది (34,500) 4 సంవత్సరాల తర్వాత 25 సంవత్సరాల వయస్సులో రిటైర్ అవుతారు. మిగిలిన 25 శాతం మంది (11,500) 4 సంవత్సరాల తర్వాత శాశ్వత సైనిక సిబ్బందిగా నియమితులవుతారు. ఇతర శాశ్వత నియామకాలేవీ ఉండవు. 2019 జనవరి 1 నాటికి, సైన్యంలో 1,04,653 ఖాళీలు ఉన్నాయి. 2019 నుండి 2023 వరకు నాలుగు సంవత్సరాలలో శాశ్వత నియామకాలు జరగలేదు. 2025 వరకు శాశ్వత నియామకాలు ఉండవు. సంవత్సరానికి సగటున 55,000 ఉద్యోగ విరమణలతో 2026 జనవరి 1 నాటికి సైన్యంలో (1,04,653 ం 55,000 7) 4,89,653 ఖాళీలు ఉంటాయి. 12 లక్షల మంది సైనికుల స్థానంలో 7 లక్షల మంది సైనికులు ఎంత పని చేయగలరు? అత్యవసర సమయాల్లో సైన్యానికి సహాయం చేయగల సెంట్రల్ సివిల్ డిఫెన్స్ ఫోర్స్‌లో 2022 జనవరి1 నాటికి 2,50,000 ఖాళీలు ఉన్నాయి. సైన్యంలో ఇంత పెద్ద సంఖ్యలో ఖాళీలున్న సమయంలో ఒకవేళ యుద్ధాన్ని ఎదుర్కోవాల్సి వస్తే! పౌర రక్షణ మాటేమిటి? దేశం ఇబ్బందుల్లో పడుతుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 2026 నుండి ఏటా 11,500 మంది అగ్నివీర్‌లను శాశ్వత స్థానాలకు నియమిస్తారు. చాలా పెద్ద సంఖ్యలో సైనికులు ఉద్యోగ విరమణ చేస్తారు. కాబట్టి 2026 నుండి, ఈ 7 లక్షలుగా వున్న సైన్యం సంఖ్య ప్రతి సంవత్సరం తగ్గుతూనే ఉంటుంది. మూడవది–నాలుగు సంవత్సరాల అగ్నివీర్ లను 6 నెలల నామ్ కే వాస్తే శిక్షణ తర్వాత నేరుగా యుద్ధానికి పంపుతారు. ఏడేళ్ల శిక్షణ తర్వాత సైన్యానికి సహాయకులుగా వెళ్లడానికి కేవలం ఆరు మాసాల శిక్షణతో సైనికులకు సహాయకులుగా పంపడానికి ఎంత వ్యత్యాసం వుంటుంది? ఇది ప్రత్యామ్నాయం అవుతుందా? యుద్ధం జరిగే అవకాశం ఉన్న దేశాలు తమ దళాల సంఖ్యను పెంచడంతో పాటు శిక్షణా వ్యవధిని, నాణ్యతను నిరంతరం మెరుగు పరుస్తున్నాయి. యుద్ధ భూమిలో సైనిక శిక్షణ పొందిన శత్రు సైనికులతో పోటీ పడటానికి 6 నెలల శిక్షణతో నాలుగేళ్ల కాంట్రాక్ట్ సైనికులు ఏ మంత్రదండాన్ని ఉపయోగిస్తారు? 2026 నుండి ఏటా 60,000 మందికి బదులుగా 11,500 మంది అగ్నిమాపక సిబ్బందిని శాశ్వత స్థానాలకు నియమిస్తారు. అంటే ఏటా 48,500 శాశ్వత నియామకాలకు అవకాశం తగ్గిపోతుంది. దేశ జనాభాలో 50 శాతం 24 ఏళ్ల లోపువారు. 65 శాతం మంది 35 ఏళ్ల లోపువారు. జనాభా సగటు వయస్సు 27.5 సంవత్సరాలు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి చూసినట్లయితే ప్రస్తుతం దేశంలో నిరుద్యోగం అత్యధిక స్థాయిలో ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఉపాధి దాదాపు సున్నా. ప్రభుత్వం సంవత్సరానికి ఉద్యోగ అవకాశాల సంఖ్యను 45,500కు తగ్గించడం ద్వారా నిరుద్యోగుల సంఖ్యను పెంచింది. ఇది ఉద్యోగార్థులను నిరాశపరిచింది. నాలుగేళ్ల తర్వాత రిటైర్ అయిన అగ్నివీర్ లకు ఎటువంటి పెన్షన్ లభించదు. 4 సంవత్సరాల సర్వీస్ సమయంలో తమ నెలవారీ జీతం నుండి 30 శాతం చొప్పున పక్కన పెట్టిన రూ.5,04,000 (వడ్డీని మినహాయించి), ప్రభుత్వం నుండి రూ.6,67,000 పొందుతారు. నాలుగేళ్ల సర్వీస్ తర్వాత, 21–25 సంవత్సరాల మధ్య వయస్కులైన అగ్నివీర్‌లు ప్రతి సంవత్సరం 37,500 మంది తమ ఉద్యోగాలను కోల్పోయి మళ్ళీ ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తారు. 25 సంవత్సరాల వయస్సులో ఉద్యోగం చేస్తూ మళ్ళీ నిరుద్యోగిగా మారడం, నెలవారీ ఆదాయం పూర్తిగా ఆగిపోవడం ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి వున్న సమస్యలు. ఈ 4 సంవత్సరాలు వారికి చదువుకోవడానికి లేదా మరో ఉద్యోగానికి సిద్ధం కావడానికి అవకాశం ఉండదు. కాబట్టి ఈ అగ్నిపథ్ సిబ్బంది అత్యంత పోటీ వాతావరణం వున్న ఉపాధి మార్కెట్‌లో కొత్త ఉద్యోగాలను పొందలేరని భావించవచ్చు. వాస్తవానికి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉద్యోగ విరమణ చేసిన సైనిక సిబ్బందికి కేటాయించిన 92–95 శాతం స్థానాలు ఎల్లప్పుడూ ఖాళీగా ఉంటాయి. భర్తీ చేయబడవు. ప్రభుత్వం సైన్యం కోసం రిజర్వు చేసిన ఉద్యోగాలను తగ్గించాలన్న 'వ్యూహా'న్ని వేసినప్పుడు అగ్నివీర్ అనే ఈ నాలుగేళ్ల కాంట్రాక్టు కార్మికులను ఉద్యోగ విరమణ తర్వాత ప్రభుత్వ కార్యాలయాల్లో నియమించడం చాలా కష్టం. ఈ విషయాన్ని పక్కన పెడితే, రిటైర్ అయిన వారికి ఆర్మీ ప్రదానం చేసే బ్యాచిలర్ డిగ్రీలను ఏ ప్రభుత్వమూ గుర్తించదు.

# కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో వెంటనే చర్చలు జరపాలి

## సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గోదా శ్రీరాములు...





**సంస్థాన్ నారాయణపూర్, మే 24( సూర్య ప్రతినిధి):** కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కొనసాగిస్తున్న ఆపరేషన్ కగారును ఆపి మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు డిమాండ్ చేశారు శనివారం నారాయణపుర్ మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన మండల సమితి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా మావోయిస్టులను హతమార్చడానికి చతిస్గడ్ తెలంగాణ ఆంధ్ర సరిహద్దుల్లో కాల్పుల మోతలతో దండకారణ్యం ఆదివాసి ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఆందోళన పడుతున్నారని ఈ దాడుల్లో అమాయక ప్రజలు బలి అవుతున్నారని ఆయన అన్నారు. మేము చర్చలకు వస్తామని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ వారి ని శాంతి చర్చలకు పిలవకుండా కేంద్ర హెూం మంత్రి వారిని అంతమొందించడమే మా లక్ష్యం అని చెప్పడం చాలా దుర్మార్గమని ఆయన అన్నారు సమావేశానికంటే ముందు సిపిఐ జాతీయ నాయకులు అమరజీవి నల్లమల గిరి ప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది . ప్రజా సమస్యలే అజెండాగా పోరాటాలు నిర్వహించాలని సిపిఐ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. అన్ని గ్రామాలలో పార్టీ గ్రామ శాఖ మహాసభలను నిర్వహించాలని ఆ తర్వాత మండల మహాసభ నిర్వహించు కోవాలని సూచించారు రాబోయే రోజులలో కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేసి నారాయణపుర్ మండలంలో మొనగాని పార్టీగా నిలుపాలని దీనికోసం మండల నాయకుడు కార్యకర్తలు సమిష్టిగా ముందుకెళ్లాలని ఆయన కోరారు ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చన గోని గాలయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కే శ్రీనివాస్, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్,జిల్లా కౌన్సిల్ సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, వీరమల్ల యాదయ్య, సుర్వి నరసింహ,మంచాల జంగయ్య, దుబ్బాక సంజీవ, కొప్పు సుధాకర్, ముత్యాల అంజయ్య, మన్నే భీమారెడ్డి, గుండు నరసింహ, కొర్ర శంకర్, బీనపల్లి గాలయ్య, కె. లచ్చు, బద్దుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథక రక్షణకై ఈనెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు

# నిర్వహిస్తున్న ధర్నాకు వందలాదిగా కార్మికులు తరలి రావాలి

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ పిలుపు





**భువనగిరి, మే 24( సూర్య ప్రతినిధి):** వలసలను ఆపాలని, పనన్న చూపండి తిండన్న పెంటండని లక్షలాదిమంది వ్యవసాయ కార్మికుల దేశవ్యాప్త పోరాట ఫలితంగా వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక రక్షణ కోసం ఈ నెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాకు వందలాదిగా కార్మికులు తరలి రావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భువనగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెంచికల్ పహాడ్ గ్రామంలో ఉపాధి హామీ పనిచేస్తున్న కార్మికుల వద్దకు వెళ్ళి వారి సమస్యలను తెలుసుకొన్న అనంతరం నర్సింహ మాట్లాడుతూ పేదలు కష్టజీవులు తమ జీవనోపాధి కోసం, చట్టాల కోసం, పని కోసం, భూమికోసం, భువ్వ కోసం పోరాడి హక్కులు, చట్టాలు సాధించుకుంటే కేంద్రంలోని ఈ మోడీ ప్రభుత్వం ఆహక్కులను, చట్టాలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తున్నారని విమర్శించారు. దేశానికి గ్రామ సీమలే పట్టుకొమ్మలు గ్రామాలలో ఉన్న ప్రజలు ఆర్థికంగా బలపడితేనే ఈ దేశం ముందుకు పోతుందనే ఉద్దేశంతో ఆనాటి ప్రభుత్వము వందరోజుల పనిని తెస్తే ఈనాడు ఈ మోడీ ప్రభుత్వం దానిని ఎత్తివేయడానికి అనేక కుట్రలు చేస్తూ కొత్త జీవోలు తెస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా కార్మికులందరూ ఐక్యంగా సంవత్సరానికి 200 రోజుల పని దినాలకోసం, రోజు కూలీ 600 రూపాయల కోసం, పెండింగ్ లో ఉన్న వేతనాల కోసం, నూతన జాబ్ కార్డుల కోసం, భార్య భర్తలకు గడ్డపార, తట్ట, పారా, కొడవలి, గొడ్డలి లాంటి పనిముట్లు కోసం, పనిచేసే దగ్గర త్రాగడానికి నీరు, నీడ కోసం టెంటు, ప్రమాదం జరిగినప్పుడు మెడికల్ కిట్టు కోసం, సమ్మర్ అలవెన్స్ ల కోసం, నాలుగు కిలోమీటర్ల దూరం దాటితే లోకల్ ఆటో చార్జీల కోసం, ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాల కోసం, ఫీల్డ్ అసిస్టెంట్లను పర్మినెంట్ చేసి వారి యొక్క వేతనాలు పెంచుట కోసం, వాచర్లను, సీనియర్ మేట్లను ప్రత్యేకంగా గుర్తించి సంవత్సరం మొత్తం పనులు కల్పించడం కోసం, అర్హత కలిగిన వారికి ఫీల్డ్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కోసం, ప్రమాదాలు జరిగితే ఉచిత వైద్యంతో పాటు, పని చేయని రోజులలో నష్టపరిహారం చెల్లింపు కోసం, ప్రమాదంలో మరణిస్తే కనీసం 10 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా కోసం, దరఖాస్తు పెట్టుకొని పని చూపని వారికి చట్ట ప్రకారం నిరుద్యోగ భృతి కోసం ఈ నెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాలో ఉపాధి హామీ కార్మికలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నర్సింహ కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య, జిల్లా కమిటీ సభ్యులు సిలివేరు ఎల్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సిలివేరు మహేందర్ ఉపాధి హామీ కార్మికులు గోపె రాజయ్య, కొంతం లత, చిన్నం శ్రీలత, సాలమ్మ, సరోజన, సుజాత, ఇందిర, సుబ్బురు కలమ్మ, సప్న, బీరమ్మ, రజిత, చింతల పద్మ, బాల లక్ష్మి, సిలువేరు జంగమ్మ, పొన్నాల శ్రీశైలం రెడ్డి, బాల్ రెడ్డి , బోనగిరి ఆంజనేయులు, గోపె నవనీత, మహేశ్వరి, లలిత, చిన్నం సుజాత, కడగంచి కల్పన, బాల్ద ఎల్లమ్మ, బసాని కలమ్మ, ఐలమ్మ, చింతల ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విద్యను వ్యాపార వస్తువుగా మారుస్తున్న పాలకులు






## పేదలకు నాణ్యమైన విద్య అందని ద్రాక్షలా మారింది

## చౌటుప్పల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులు

**చౌటుప్పల్, మే 24( సూర్య ప్రతినిధి ):** ప్రయివేటు,కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రభుత్వ కనుసన్నల్లో నడుపుతూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ పేదలకు నాణ్యమైన విద్యను పాలకులు దూరం చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతుల్లో మాట్లాడుతూ విద్యను వ్యాపార వస్తువుగా మార్చి పేద మధ్యతరగతి విద్యార్థులకు అందని ద్రాక్షలా మారుతుందాన్నారు.కార్పొరేట్ విద్యా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులను యదేచ్ఛగా పెంచుకుంటున్నా విద్యా సంబంధిత అధికారులు, పాలకులు చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా ఎలాంటి అనుమతులు లేకున్నా నారాయణ, చైతన్య వంటి కార్పొరేట్ విద్యాసంస్థలు ఆవహించాయి. ప్రభుత్వాన్ని నడిపే మంత్రులు,ఎంపీ,ఎమ్మెల్యే,టీచర్ ఎం.ఎల్.సి లు విద్యా సంస్థలను నడిపిస్తూ విద్యను వ్యాపారం చేస్తుంటే పేద విద్యార్థులకు ఎం న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వాలు మారినా పాలకుల బుద్ధి మారడంలేదని అన్నారు. ఇప్పటివరకు తెలంగాణా రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రి లేకపోవడం విదపై పాలకులకు ఉన్న చిత్త శుద్ధి కనబడుతుందని అన్నారు. వెంటనే ప్రయివేటు, కార్పొరేటు విద్యా సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించి అందరికి సమాన నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఇ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడ్య రాజు, చౌటుప్పల్ మండల కార్యదర్శి తెగుల్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, ఈర్ల రాహుల్,పుట్టల ఉదయ్ కుమార్,పొట్లచెర్వు గాయత్రి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మద్దూర్ టౌన్ లో పవర్ కట్

### విద్యుత్ ఏఈ నిరంజన్ దాస్

**మద్దూర్, మే 24:-** నారాయణపేట జిల్లా మద్దూర్ పట్టణ కేంద్రంలో ఆదివారం రోజు విద్యుత్ సరఫరా ఉదయం 11 గంటల నుంచి 5 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి నిరంజన్ దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మద్దూర్ పట్టణ కేంద్రంలో రోడ్డు వెడల్పు సందర్భంగా ఈ అంతరాయం కలుగుతుందని దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ ఏ ఈ కోరారు.

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక జరగాలి

### మాజీ సర్పంచ్ శికిలమెట్ల శ్రీహరి



**సంస్థాన్ నారాయణపూర్, మే 24( సూర్య ప్రతినిధి):** కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చెప్పు కుంటున్న ఆరు గ్యారెంటీలో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో గందరగోళం నెలకొన్నదని సంస్థాన్ నారాయణపుర్ గ్రామ మాజీ సర్పంచ్ శికిలమెట్ల శ్రీహరి పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక షరతులు పెట్టి అర్హుల జాబితాను క్రమంగా తగ్గిస్తుందని వారన్నారు.ఇల్లు లేని నిరుపే దలందరికీ ఇందిరమ్మ ఇళ్లలో అవకాశం కల్పిం చాలన్నారు. రాజకీయ పార్టీల తోటి సంబంధం లేకుండా ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఇందిరమ్మ కమిటీలను నియమించిన విషయం మనందరికీ తెలిసిందే. ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామస్థాయిలో అధికారులతో చర్చించి పారదర్శకంగా రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగాలని వారన్నారు. మన పార్టీ వాడా,కాదా అని ఆలోచన చేస్తూ ఇండ్లు మంజూరు చేస్తున్నారని ఏకపక్షంగా ఎంపిక చేసే పద్ధతిని మార్చుకోవాలన్నారు. గ్రామంలో ఎవరైతే ఇండ్లు లేని నిరుపేదలున్నారో వారందరికీ ఇండ్లు మంజూరు చేయాలన్నారు.అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వ అధికారులపై విశ్వాసం ఉందని నిజమైన అర్హులకే ఇల్లు మంజూరు అవుతుందనే నమ్మకం ఉన్నదనే విషయాన్ని వారు గుర్తు చేశారు. గ్రామస్థాయిలో ఇందిరమ్మ కమిటీ పేర్లు గోప్యమే, అధికారులు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో చర్చించిన సమావేశాలు గోప్యమే, అధికారికంగా బహిరంగంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులతో అధికారులు సమావేశం నిర్వహించి చర్చించిన దాఖలాలయితే కనబడటం లేదు. అధికార పార్టీ నేతల చుట్టూ తిరిగితేనే ఇందిరమ్మ ఇండ్లు వస్తాయనే విధానం, గ్రామాల్లో ప్రజల్లో చర్చ జరుగుతున్న విషయం అధికారులు గమనించాలి.నిజమైన అర్హులకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తేలేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపిక ప్రక్రియలో జరిగిన అవకతవకలపై పోరాటానికి సైతం సిద్ధమని వారన్నారు. రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ జరగాలన్నారు. అద్దె ఇళ్లలో ,ఇల్లు లేక నిలువ నీడ లేక అవస్థలు పడుతున్న నిజమైన అర్హులకు అన్యాయం జరిగితే ఎంత వరదాకైనా పోరాటనికి సిద్ధమని వారికి మా పార్టీ పరంగా అండగా ఉంటామని అన్నారు. అధికార పార్టీ నాయకులు పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వం నుంచి గ్రామానికి మరిన్ని ఇండ్లు తీసుకొచ్చే ప్రయత్నం చేయాలే తప్ప, గ్రామంలోని నిజమైన అర్హుల సంఖ్యను క్రమంగా తగ్గించే ప్రయత్నం చేయొద్దనే విషయాన్ని గుర్తు చేశారు. మా పార్టీ, మీ పార్టీ అనే ఆలోచన ధోరణి లేకుండా ఇల్లు ఉన్నదా లేదా అనే విషయాన్ని గుర్తించి సర్వే నిర్వహించి ఎంపిక ప్రక్రియ జరగాలన్నారు.ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగకుంటే ప్రభుత్వ కార్యాలయాల ముందు నిజమైన అర్హులతో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా గ్రామస్తుల సమక్షంలో గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలన్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన వారి జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయానికి అతికించాలన్నారు. నిజమైన అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరయ్యే వరకు మీ పక్షాన బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా వారు భరోసా కల్పించారు.

## శ్రీ మేళచెర్ల చెన్నగిరి లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహెూత్సవం లో పాల్గొన్న

### కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి





**సంస్థాన్ నారాయణపూర్, మే 24( సూర్య ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో శ్రీ మేళచెర్ల చెన్నగిరి లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహెూత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజ నిర్వహించిన స్వామివారి దీవెనలు పొందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, మెంగ యాదయ్య, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, కంకణాల గూడెం మాజీ సర్పంచ్ సరిపెల్లి శైలజ సత్యనారాయణ, ఈద శంకరయ్య, అంతటి స్వామి గౌడ్, కొండ నవీన్ గౌడ్, ఈసం శివకుమార్, బానోత్ కిరణ్, చేర్క కుటుంబ సభ్యులు ,గ్రామ ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు.



## ఖమ్మం కమిషనరేట్లో పట్టుబడిన 90.706 కిలోల గంజాయి దహనం



**ఖమ్మం (సూర్య ప్రతినిధి)** వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ నేతృత్వంలో శనివారం శాస్త్రీయ పద్ధతిలో దహనం చేశారు.ఖమ్మం పోలీస్ కమిషనరేట్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో పట్టుబడిన సీజ్ చేసిన 90.706 కిలోల ఎండు గంజాయిని అడిషనల్ డీసీపీ ఆడ్మిన్ నరేష్ కుమార్ టాస్క్ ఫోర్స్ ఏసీపీ రవి పర్యవేక్షణలో ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాల్‌పేట గ్రామంలో ఉన్న ఏడబ్ల్యూఎం కన్సల్టెన్సీ బైయో వెస్టేజ్ బర్నింగ్ ప్లాంట్ లో దహనం చేశారు.ఖమ్మం వన్ టౌన్ త్రీ టౌన్ ఖమ్మం రూరల్ ఖానాపురం హావేలి కూసుమంచి నేలకొండపల్లి తిరుమలాయపాలెం వైరా తల్లాడ సత్తుపల్లి వేంసూరు విఎం బంజర ఏన్కూర్ పోలీస్ స్టేషన్లకు సంబంధించిన 17 కేసుల్లో గంజాయి అక్రమ రవాణా అమ్మకాలు జరిపిన నేరస్థులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు అడిషనల్ డిసీపీ తెలిపారు. జిల్లా పోలీస్ స్టేషన్లలో నిల్వ ఉన్న గంజాయి సరకును కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల గెజిట్ నోటిఫికేషన్ల ఆధారంగా పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్వీర్యం చేశామన్నారు.ఈ కార్యక్రమంలో సీసీఆర్బీ సిఐ స్వామి తల్లాడ ఎస్సై కొండలరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నెలాఖరులోపు వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.**



**మద్దూర్, మే 24:-** భూభారతి పైలెట్ ప్రాజెక్టు మద్దూరు మండలానికి సంబంధించిన భూ భారతి దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను నెలాఖరు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం మద్దూరు తహాసిల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న భూ సమస్యల దరఖాస్తుల వెరిఫికేషన్ ను ఉదయం, సాయంత్రం రెండు దఫాలుగా కలెక్టర్ పర్యవేక్షించారు. భూ భారతి పైలెట్ ప్రాజెక్టు మద్దూరు మండలంలో వచ్చిన మొత్తం దరఖాస్తుల వెరిఫికేషన్ వేగంగా చేయాలన్నారు. అనుమతించిన, తిరస్కరించిన దరఖాస్తుల పూర్తి వివరాలు, వాటి సమాచారం, క్షేత్ర స్థాయిలో చేసిన విచారణ సమగ్రంగా ఉండాలన్నారు. మండలంలో ప్రభుత్వ భూముల సర్వే పగడ్బందీగా చేపట్టాలన్నారు. మిస్సింగ్ సర్వే నంబర్లు, హద్దుల ఏర్పాటు, భాగ పరిష్కారం, విరాసత్ లాంటి భూ సమస్యల పరిష్కారం పై అధికారుల ఫీల్డ్ వెరిఫికేషన్ లో ఖచ్చితమైన స్పష్టత ఉండాలన్నారు. ఎందుకు తిరస్కరించామనే కారణాన్ని రైతులకు చెప్పాల్సిన అవసరం ఉంటుందన్నారు. నెలాఖరు నాటికి వంద శాతం దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. భూ సమస్యలకు చట్ట ప్రకారం పరిష్కారం చూపే బాధ్యత అధికారులదేనని ఆమె స్పష్టం చేశారు. విరాసత్ దరఖాస్తుల పరిష్కారానికి నిబంధనలను అనుసరించాలన్నారు. పైలెట్ మండలంలో అధికారులు భూ సమస్యలకు చూపించే పరిష్కారాలనే మళ్ళీ కొత్తగా ఎంపిక చేసే ఒక్కో పైలెట్ మండలాలలో వర్తింప చేసే అవకాశం ఉంటుందని, అందుకే ఒకటికి రెండుసార్లు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో ఆర్డీఓ రామచంద్ర నాయక్, భూ భారతి ప్రత్యేక అధికారి యాదగిరి, మద్దూరు, కోస్గి, తహాసిల్దారులు, మహేశ్ గౌడ్, బక్క శ్రీనివాస్, దయాకర్ రెడ్డి, రెవెన్యూ బృందం పాల్గొన్నారు.

## బదిలీ అయిన అధికారికి సన్మానం.



**వనపర్తి సూర్య ప్రతినిధి...** వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం లో ఇటీవల జరిగిన బదిలీల్లో తాసిల్దార్ మురళి పెబ్బేరు కు వెళ్లారు. శ్రీరంగాపురంలో ప్రభుత్వ భూములను కాపాడి బ్రహ్మోత్సవాల సమయంలో ఎలాంటి ఆవాచనీయ సంఘటనలుచోటుచేయకుండా అధికారులకు సమన్వయం చేసుకుంటూ బందోబస్తులు ఏర్పాట్లు అమలుచేసి ప్రజల కు ఆయన చేసిన కృషి ఎనలేనిదని మండల బిసి పొలిటికల్ జేఏసీ అధ్యక్షులు ధర్మేందర్ అన్నారు అనంతరం ఆయనకు శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో జేఏసీ ఉపాధ్యక్షుడు గుంటి రవి సాగర్ కార్యదర్శి రవి ప్రధాన కార్యదర్శి రమేష్ మండల యూత్ బీసీ పొలిటికల్ జేఏసీ రమేష్. భాస్కర్. శివ. తదితరులు పాల్గొన్నారు

# క్రమశిక్షణ నిబద్ధతకు మారుపేరు గిరిప్రసాద్

-సిద్దాంతాన్ని చంపేయడం అమిత్ షా తరం కాదు
-ట్రంప్ ముందు మోకారిల్లుతున్న మోడీ
-సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



**ఖమ్మం( సూర్య ప్రతినిధి)** క్రమశిక్షణ నిబద్ధతకు మారుపేరుగా దివంగత సిపిఐ నేత సాయుధ పోరాట యోధుడు నల్లమల గిరిప్రసాద్ నిలిచారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ తెలిపారు. తుదిశ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమ నిర్మాణం కోసం పరితపించిన మహోన్నతుడని ఆయన కొనియాడారు. గిరిప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలోని గిరిప్రసాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రిక్కాబజార్ హైస్కూల్ గ్రౌండ్స్లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ గిరిప్రసాద్ ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో సంక్లిష్ట పరిస్థితి నెలకొందని మావోయిస్టుల పేరుతో అమాయక గిరిజనుల ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు.అమిత్ షా ప్రకటించినట్లుగా మావోయిస్టు నిర్మూలన 2026 మార్చి 31 కాదు కదా ఎన్నటికి అది సాధ్యం కాదని నారాయణ తేల్చి చెప్పారు. సిద్ధాంతాన్ని ఆచరిస్తున్న కొంత మందిని హత్య చేయడం సాధ్యమేమో కాని సిద్ధాంతాన్ని చంపేయడం అంత తేలిక కాదని అదే సమయంలో మావోయిస్టులు సైతం తమ పంథాను మార్చుకోవాలన్నారు. నాడు సాయుధ పోరాటంలో వేల మందిని హతమార్చారని గిరిప్రసాద్ ని సైతం హతమార్చాలని ప్రయత్నించినప్పుడు తుపాకి గుండుకు ఎదురొడ్డి నిలిచారని నారాయణ తెలిపారు. ఈ దేశంలో టెర్రరిస్టుల పట్ల మోడీ మెతక వైఖరిని అవలంభిస్తూ మావోయిస్టుల విషయంలో మాత్రం సరిహద్దు సైన్యాలను దింపి అంతమొందించాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మేము శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నా ఎందుకు చర్చలు జరపడం లేదన్నారు. ప్రశ్నించే వారిని చంపేస్తూ నియంత పాలన వైపు మోడీ అడుగులేస్తున్నారని ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమన్నారు. మేము యుద్ధం వద్దంటే దేశ ద్రోహులన్నారని మరి యుద్ధం ఆపిన మోడీ సర్కార్ ను ఏమనాలని నారాయణ ప్రశ్నించారు. ఈ దేశ రాజ్యాంగానికి మావోయిస్టుల నుంచి కానీ మరే ఇతరుల నుంచి కానీ ప్రమాదం లేదని ఆ ప్రమాదం బిజెపి వైపు నుంచి మాత్రమే పొంచి ఉందన్నారు. ఈ దేశంలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థల పైన మోడీ అమిత్ షా లే దాడి చేస్తున్నారని సుప్రీం కోర్టును ప్రశ్నించింది కూడా ఉప రాష్ట్రపతి బిజెపి వారేనని ఆయన తెలిపారు. ఫెడరల్ వ్యవస్థను ధ్వంసం చేస్తూ దేశంలో లౌకిక ప్రజాతంత్ర శక్తుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ దేశంలో కులగణన 2029 నాటికి పూర్తి చేయాలని ఈ దేశ చట్టసభలలో బిసిలకు రిజర్వేషన్ కల్పించాలని నారాయణ డిమాండ్ చేశారు. ఒకపక్క పన్నుల భారం మోపుతూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మరో పక్క గుజరాత్కు చెందిన ఆర్థిక టెర్రరిస్టులు రూ. 16లక్షల కోట్లు ఎగవేస్తే ఈ మోడీ ప్రభుత్వం ఏమి చేసిందన్నారు. 29 మంది ఆర్థిక టెర్రరిస్టుల్లో 28 మంది గుజరాత్ వారేనని అందులో ఏడుగురు మోడీ ఇంటి పేరు కలిగిన వారేనని నారాయణ తెలిపారు. ఆర్థిక ఉగ్రవాదులు టెర్రరిస్టుల కంటే ప్రమాదమని ఆయన తెలిపారు. నియంత పాలనకు ప్రయత్నాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజా చైతన్యానికి కృషి జరగాలని వామపక్ష లౌకికశక్తుల ప్రత్యామ్నాయం మాత్రమే దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడగలదన్నారు. రాజకీయం వ్యాపారమైందని రాజకీయ పార్టీల్లో అంతర్గత విబేధాలను సృష్టించి లబ్ధి పొందేందుకు బిజెపి ప్రయత్నిస్తుందన్నారు. అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వామపక్ష ఉద్యమం బలపడాలని నారాయణ పిలుపునిచ్చారు.. మావోయిస్టులు ఈ దేశ పౌరులు కారా శాంతి చర్చలకు సిద్ధమంటే ఎందుకు ప్రభుత్వం స్పందించడం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ప్రశ్నించే వారిని బిజెపి ప్రభుత్వం హతమారుస్తుందని ఆయన ఆరోపించారు. గిరిప్రసాద్ 29వ వర్ధంతి సభలో కూనంనేని మాట్లాడుతూ నాడు నైజం రక్కసి మూకలు ఐదువేల మందిని హతమార్చారని నాడు నిజాం ప్రభుత్వం ఏవిధంగా పట్టుకొచ్చికాల్చి చంపిందో ఇప్పుడు బిజెపి ప్రభుత్వం అదే పంథాను అనుసరిస్తుందన్నారు. ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా తదితరులు ప్రసంగించారు.

# డ్రైనేజ్ సమస్యలపై పోరాటానికి సిద్ధం



మైలర్ దేవ్ పల్లిలో డ్రైనేజ్ సమస్యలపై తక్షణ స్పందన
రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇన్చార్జ్ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి పర్యటన

**గండిపేట్: సూర్య ప్రతినిధి** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో నెలకొన్న భూగర్భ డ్రైనేజ్ సమస్యలపై స్థానికులు బాధను వ్యక్తపరిచిన నేపథ్యంలో, నియోజకవర్గ ఇంచార్జ్ మరియు డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి తక్షణమే స్పందించారు. మైలర్ దేవ్ పల్లి గ్రామంలో డ్రైనేజ్ పైపులైన్ దెబ్బతినడంతో కలుషిత నీరు రోడ్లపైకి వెల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితిని దగ్గరగా పరిశీలించేందుకు కార్పొరేటర్ గారు హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బి అధికారులతో పాటు పార్టీ నాయకులు, స్థానికులతో కలిసి ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీలో వదులుతున్న కలుషిత నీరు తాగునీటి సరఫరాలో కలవకుండా ఉండేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి నమూనాలను ల్యాబ్‌కి పంపించి పరీక్షలు చేయాలని, నివేదిక ఆధారంగా అవసరమైన రకాల శుద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు. డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను దశల వారీగా పరిష్కరించేందుకు అన్ని అధికారులతో సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తాను అని కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అధికార యంత్రాంగం ప్రజల సమస్యలను ముందుగానే గుర్తించి, స్పందన చూపించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మన్మోహన్ రెడ్డి, ఎన్ను శ్రీనివాస్ రెడ్డి, రావుల భాస్కర్ రాజేష్, బాల్ రెడ్డి, రవీందర్, అనిల్, రవి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బి డీజీఎం రేణుక, సూపర్‌వైజర్ లోక్‌నాథ్, రవి నాయక్, జిహెచ్ఎంసి సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.





# బిజినెస్

## ఈ టాటా నుంచి మరో ప్రీమియం హ్యాచ్‌బ్యాక్..




కొత్త ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ కోసం బుకింగ్‌లు వచ్చే నెల జూన్ 2 నుండి ప్రారంభమవుతాయి. అయితే వాహనం డెలివరీ ఎప్పుడు ప్రారంభమవుతుందనే దానిపై కంపెనీ ఇంకా ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. టాటా మోటార్స్ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ మోడల్ లాంచ్ అయింది. ఈ వాహనం 2020 లో కస్టమర్ల కోసం ప్రారంభించింది. ఇప్పుడు ఈ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ దాని మొదటి ప్రధాన అప్‌డేట్‌తో వస్తోంది. కొత్త ఆల్ట్రోజ్ కొత్త డిజైన్, కొత్త ఫీచర్లతో ప్రారంభించింది. ఈ కారులో స్మార్ట్, ప్యూర్, క్రియేటివ్, అకంప్లిష్డ్ ఎస్ మరియు అకంప్లిష్డ్ ప్లస్ ఎస్ అనే ఐదు వేరియంట్లు విడుదలయ్యాయి. భద్రత కోసం టాటా మోటార్స్ నుండి వచ్చిన ఈ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌లో 6 ఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్, సీట్ బెల్ట్ రిమైండర్‌తో కూడిన 3 పాయింట్ల జూ= వంటి ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. దీనితో పాటు, ఈ కారులో స్మార్ట్ డిజిటల్ స్టీరింగ్ వీల్, రిమోట్ కీలెస్ ఎంట్రీ, ఆల్ డోర్ పవర్ విండోస్, మల్టీ డ్రైవ్ మోడ్‌లు, ఐడిల్ స్టార్ట్/స్టాప్ వంటి ఫీచర్లను కంపెనీ అందించింది. 12.8 సెకన్లలో 0 నుండి 100 కి వేగవంతం అయ్యే కొత్త టాటా ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ మోడల్, 200 చీఎ టార్క్ ఉత్పత్తి చేసే 1.2-లీటర్ రెవోట్రాన్ పెట్రోల్ ఇంజిన్‌తో శక్తిని పొందుతుంది. ఈ కారును 5 స్పీడ్ మాన్యువల్, 5 స్పీడ్ ఆటోమేటిక్ 6 స్పీడ్ డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఎంపికలతో కొనుగోలు చేయవచ్చు. 5 రంగుల ఎంపికలలో ప్రారంభించిన కొత్త టాటా ఆల్ట్రోజ్ పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో 345 లీటర్ల బూట్ స్పేస్ ఉంటుంది. అయితే జచీ+ వేరియంట్ 210 లీటర్ల బూట్ స్పేస్ కలిగి ఉంటుంది. ఇప్పుడు ఆల్ట్రోజ్ కొత్త ఫ్రంట్ గ్రిల్, కొత్త ఫ్రంట్ బంపర్, డ్యూయల్ టోన్ 16 అంగుళాల అల్లాయ్ వీల్స్, ఫ్లష్ డోర్ హ్యాండిల్స్ (సెగ్మెంట్‌లో మొదటిది) తో అందుబాటులో ఉంటుంది. ఈ కారులో జంట 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, నావిగేషన్ మ్యాప్ వ్యూతో కూడిన డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్ ఉంటాయి.

## ఐటీఆర్ ఫైల్ చేస్తున్నారా?




పరిమితికి మించి ఆదాయం పొందుతున్న వారందరూ ప్రభుత్వానికి ఆదాయపు పన్ను చెల్లించాలి. రాబడి వచ్చే వ్యక్తులు, కంపెనీలు, సంఘాలు.. ఇలా అన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది. ఆ ఏడాదిలో సంపాదించిన ఆదాయ వివరాలు తెలియజేస్తూ ఆదాయపు పన్ను శాఖకు ఐటీఆర్ (ఇన్ కంట్యాక్స్ రిటర్న్లు) దాఖలు చేయాలి. ఆ శాఖ అధికారులు దాన్ని పరిశీలించి, మీ కట్టాల్సిన పన్నును నిర్ధారణ చేస్తారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఐటీఆర్ ను జూలై 31లోగా సమర్పించాలి. దీని కోసం ఐటీఆర్ 1 నుంచి 7 వరకూ వివిధ రకాల ఫారాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో ఎవరు ఏ ఐటీఆర్ ఫారం సమర్పించాలో ఇప్పుడు తెలుసుకుందాం. మన దేశంలో ఆదాయపు పన్ను చెల్లింపుదారు లకు ఏడు రకాల ఐటీఆర్ ఫారాలను ఆదాయపు శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. వ్యక్తుల నుంచి కంపెనీల వరకూ కేటగిరీల వారీగా వీటిని వినియోగించాలి. ముఖ్యంగా తాము ఏ ఫారం సమర్పించాలో చెల్లింపుదారులకు తెలియాలి. దీని వల్ల సకాలంలో ఐటీఆర్ దాఖాలు చేయడంతో పాటు, తిరస్కరణకు గురయ్యే ప్రమాదం తప్పుతుంది. జీతం పొందే ఉద్యోగులు, ఫీలాన్సర్లు, నిపుణులు తమ ఆదాయానికి అనుగుణంగా పన్ను కట్టాలి. వీరిని జనరల్, సీనియర్ (60-80 ఏళ్లు), సూపర్ సీనియర్ (80 ఏళ్లకు పైగా)గా విభజించారు. వీరిలో రూ.50 లక్షల వరకూ జీతం రూపంలో ఆదాయం పొందే వారు ఐటీఆర్-1 (సహజ్), మూలధన లాభాలు, బహుళ ఆస్తులున్న వారు ఐటీఆర్-2, వ్యాపారం, ప్రొఫెషన్ నుంచి ఆదాయం వచ్చే వారు ఐటీఆర్-3, అలాగే సెక్షన్లు 44ఏడీ, 44ఏడీఏ, 44 ఏఈ కింద ఊహాజనిత ఆదాయం కోసం ఐటీఆర్-4 (సుగమ్)ను దాఖాలు చేయాలి. హెచ్ యూఎఫ్ అంటే అవిభక్త కుటుంబం అని అర్థం. దీన్ని చట్టం ద్వారా ఏర్పాటు చేశారు.

# యూపీఐ లావాదేవీలతో క్రెడిట్ కార్డులకు బైబై

ప్రస్తుత కాలంలో డిజిటల్ చెల్లింపులు విపరీతంగా పెరిగిపోయాయి. రోడ్డు పక్కన ఉండే చిన్న బడ్డీ కొట్టు నుంచి ఫైవ్ స్టార్ హొటళ్ల వరకూ అన్నిచోట్లా ఇవి పనిచేస్తున్నాయి. చిల్లర సమస్య లేకపోవడం, చాలా ఈజీగా చెల్లింపులు జరగడంతో ప్రతి ఒక్కరూ ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్ (యూపీఐ) ద్వారా స్మార్ట్ ఫోన్ ఉపయోగించి చాలా సులువుగా వీటిని జరపొచ్చు. ఈ నేపథ్యంలో యూపీఐ ద్వారా చెల్లింపులు జరిపే వారికి ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. క్రెడిట్ కార్డు ద్వారా జరిపే చెల్లింపుల కంటే చౌకగా మార్చాలని ప్రయత్నిస్తోంది. మన దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం బాగా ఎక్కువగా ఉంటుంది. నిర్ణీత ఆదాయం పొందే వారందరికీ వివిధ బ్యాంకులు వీటిని మంజూరు చేస్తున్నాయి. క్రెడిట్ కార్డులపై అనేక రాయితీలు కూడా ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో చాలామంది క్రెడిట్ కార్డుల ద్వారా షాపింగ్ చేస్తున్నారు. అయితే క్రెడిట్ కార్డుల ద్వారా లావాదేవీలు జరిపితే ఆ వ్యాపారుల నుంచి 2 నుంచి 3 శాతం మేర మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)ను వసూలు చేస్తారు. ఉదాహరణకు మీరు క్రెడిట్ కార్డు ఉపయోగించి వంద రూపాయల వస్తువు కొన్నారు. ఆ మేరకు వ్యాపారస్తుడికి డబ్బులు చెల్లించారు. ఆ లావాదేవీ కారణంగా వ్యాపారులు 2 నుంచి 3 రూపాయాలను ఎండ్డీఆర్ గా చెల్లించాలి. చాలా సందర్భాల్లో వ్యాపారులే ఆ ఖర్చును భరిస్తారు. కొందరైతే కొనుగోలుదారుడి నుంచే వసూలు చేస్తారు. కానీ యూపీఐ చెల్లింపుల ద్వారా అలాంటి చార్జీలు




ఉండవు. యూపీఐ ద్వారా చెల్లింపులు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను నేరుగా కొనుగోలుదారుడికే అందించడానికి వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక యంత్రాగాన్ని అన్వేషిస్తోంది. అది సక్రమంగా అమలైతే యూపీఐ యూజర్లకు మరింత ప్రయోజనం కలుగుతుంది. తద్వారా క్రెడిట్ కార్డుతో వంద రూపాయలతో కొనుగోలు చేసే వస్తువును యూపీఐ ద్వారా రూ.98కే పొందవచ్చు. దీని కారణంగా యూపీఐ లావాదేవీలు మరింత పెరిగే అవకాశం కలుగుతుంది. ఈ-కామర్స్ సంస్థలు, పేమెంట్ సేవా ప్రొవైడర్లు, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ పీసీఐ), ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్), వినియోగదారుల సంఘాలతో వినియోగదారుల మంత్రిత్వ శాఖ చర్యలు జరపనుంది. జూన్ లో జరిగే స్టేక్ హోల్డర్ల సమావేశం అనంతరం అమలయ్యే అవకాశం ఉంది.

## భారత్‌లో ఐఫోన్‌లు తయారు చేస్తే..

భారత్‌లో ఐఫోన్‌ల తయారీ ప్రయత్నాలపై ట్రంప్ మరో సారి వార్నింగ్ ఇచ్చారు. అమెరికాలో తప్ప ఎక్కడ ఐఫోన్‌లు తయారు చేసినా 25 శాతం సుంకం తప్పక విధిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు."అమెరికన్లు కొనే ఐఫోన్‌లను అమెరికాలోనే తయారు చేయాలి. ఈ విషయాన్ని నేను టిమ్‌కుక్‌తో గతంలోనే చెప్పా. ఇండియానే కాదు.. ప్రపంచంలో ఎక్కడా వీటిని తయారు చేయకూడదు. ఇది కుదరకపోతే యాపిల్ సంస్థ కనీసం 25 సుంకాన్ని అమెరికా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ధన్యవాదాలు" అని సూటిగా చెప్పేశారు. ఈ పోస్టు తరువాత యాపిల్ షేర్లు భారీ కుదుపునకు లోనయ్యాయి. ప్రీమార్కెట్ ట్రేడింగ్‌లో షేర్ల ధర 2.5 శాతం మేర తగ్గింది. యూఎస్ స్టాక్ ఫ్యూచర్స్ కూడా నష్టాల బాట పట్టాయి. ప్రత్యేకంగా ఓ కంపెనీని టార్గెట్ చేస్తూ సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి ఉందా అన్న అంశంలో మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ట్రంప్ వ్యాఖ్యలపై యాపిల్ ఇంకా స్పందించాల్సి ఉంటుంది. చైనాపై ట్రంప్ భారీ సుంకాలు విధించాక యాపిల్ తన ఐఫోన్ తయారీ కార్యకలాపాలను భారత్‌లో చేపట్టేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. జూన్‌లో అమెరికాకు చేరే ఐఫోన్‌లు దాదాపుగా భారత్‌లోనే తయారవుతాయని అంతర్జాతీయ మీడియా చెబుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వివిధ రంగాలకు చెందిన తయారీ కార్యకలాపాలను అమెరికాలోనే చేపట్టాలని ట్రంప్ పట్టుబడు తున్నారు. ఈ క్రమంలోనే సుంకాల కొరడా ఝుళిపిస్తున్నారు. ఇదిలా ఉంటే.. అమెరికాలో తయారు చేసే ఐఫోన్‌ల ధరలు భారీగా ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత ధరకు



మూడు రెట్ల మేర ఐఫోన్ ధర పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో యాపిల్ సంస్థ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. భారత్‌లో ఇప్పటికే ఫాక్స్‌కాన్ తన తయారీ కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. 1.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు సిద్ధమైంది. ప్రస్తుతం ఐఫోన్‌లను తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలోని యూనిట్‌లలో అసెంబుల్ చేస్తున్నారు.

# టీమ్‌ఇండియా టెస్ట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్

# స్పోర్ట్స్

ముంబయి: భారత టెస్టు క్రికెట్‌లో కొత్త శకం ప్రారంభమైంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో రోహిత్ శర్మ వారసుడిగా యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. అందరూ భావించినట్లుగానే టెస్టు జట్టు కెప్టెన్సీ పగ్గాలను గిల్‌కు అప్పగించింది. ఈ మేరకు వచ్చే నెలలో ఇంగ్లాండ్ పర్యటనకు టీమ్‌ఇండియా జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. సారథిగా శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్‌ను తీసుకుంది. మొత్తం 18 మంది ఆటగాళ్లతో జట్టును ప్రకటించింది. జూన్ 20 నుంచి ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది.

**టీమ్ ఇండియా జట్టు ఇదే..**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్). రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్.

**కోహ్లీ స్థానంలో ఆ ఇద్దరిలో ఒకరు..**

సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్ ఈ సిరీస్‌తోనే టెస్టుల్లో ఎంట్రీ ఇవ్వనున్నారు. ఇక, కరుణ్ నాయర్ 8 ఏళ్ల తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌లో అడుగుపెడుతున్నాడు. చివరిసారిగా అతడు




2017 మార్చిలో టెస్టు మ్యాచ్ ఆడాడు. టెస్టు ఫార్మాట్‌కు కోహ్లీ రిటైర్మెంట్ ఇవ్వడంతో నంబరు 3లో ఎవరు వస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఆ స్థానంలో సాయి సుదర్శన్ లేదా కరుణ్ నాయర్‌ను తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. గాయంతో బాధపడుతున్న షమీతో పాటు శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్‌కు జట్టులో చోటు దక్కలేదు.

## కెప్టెన్ అవుతాడన్నారు.. కట్ చేస్తే! ఇప్పుడు టీమ్‌లోనే నో ఛాన్స్

ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు 18 సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. కొత్త టెస్టు కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్‌ను ఎంపిక చేసిన బీసీసీఐ సెలక్షన్ కమిటీ.. కరుణ్ నాయర్, కుల్దీప్ యాదవ్, శార్దూల్ ఠాకూర్‌లను తిరిగి పిలుపునిచ్చింది. అయితే ఛీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ అండ్ కో ఎంపిక చేసిన ఈ జట్టుపై భిన్నభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను పక్కన పెట్టడాన్ని చాలా మంది తప్పుబడుతున్నారు. ఇటీవల కాలంలో అయ్యర్ దేశవాళీ క్రికెట్‌తో పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. భారత్ ఛాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకోవడంలోనూ శ్రేయస్‌ది కీలక పాత్ర. అదేవిధంగా 2024-25 రంజీ ట్రోఫీ సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ కేవలం ఏడు ఇన్నింగ్స్‌లలో 68.57 సగటుతో 480 పరుగులు చేశాడు. అయ్యర్ ఫార్మాట్‌తో సంబంధం లేకుండా దుమ్ము లేపుతున్నాడు. ఐపీఎల్-2025లో కెప్టెన్‌గా, ఆటగాడిగా ఈ ముంబై బ్యాటర్ అదరగొడుతున్నాడు. అయితే గతేడాది మాత్రం అయ్యర్ టెస్టుల్లో చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు.

శ్రేయస్ గత 12 ఇన్నింగ్స్‌లలో 17 సగటుతో 187 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అందుకే సెలెక్టర్లు అతడిని పక్కన పెట్టి ఫామ్‌లో ఉన్న కరుణ్ నాయర్‌ను తిరిగి జట్టులోకి తీసుకున్నారు. ఏదేమైనా ప్రస్తుత ఫామ్‌ను పరిగణలోకి తీసుకుని అయ్యర్‌ను ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక చేసి ఉంటే బాగుండేంది అని పలువురు మాజీలు అభిప్రాయపడుతున్నారు. అయ్యర్ జట్టులో ఉంటే మిడిలార్డర్ పటిష్టంగా ఉంటుందని మరి కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. శ్రేయస్ అయ్యర్ అభిమానులైతే



ఒకడుగు ముందుకు వేసి సెలక్టర్లపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. కెప్టెన్ కావాల్సిన ఆటగాడికి పూర్తిగా జట్టులోనే ఛాన్స్ ఇవ్వరా అంటూ మండిపడుతున్నారు. శ్రేయస్ అయ్యర్ ఇప్పటివరకు 14 టెస్టులు ఆడి 36.86 సగటుతో 811 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లలో 5 హాఫ్ సెంచరీలతో పాటు ఒక సెంచరీ ఉంది.

ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు: శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్

## పోతూ పోతూ పంజాబ్‌కు షాక్.. విజయంతో సీజన్‌ను ముగించిన దిల్లీ



జైపుర్: ఐపీఎల్ 2025ని దిల్లీ క్యాపిటల్స్ విజయంతో ముగించింది. ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు దూరమైన దిల్లీ.. అగ్రస్థానంపై కన్నేసిన పంజాబ్ కింగ్స్ కు షాకిచ్చింది. జైపుర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్‌పై దిల్లీ ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని దిల్లీ 4 వికెట్లు కోల్పోయి 3 బంతులు మిగిలుండగా ఛేదించింది. సమీర్ రిజ్వీ (58లిబీ 25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు అర్ధ శతకం బాదాడు. కరుణ్ నాయర్ (44బీ 27 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (35బీ 21 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), ఫాఫ్ డుప్లెసిస్ (23బీ 15 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) శుభారంభం అందించగా.. సెధిఖుల్లా అటల్ (22బీ 16 బంతుల్లో 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్ 2, మార్కో యాన్సెన్, ప్రవీణ్ దూబె ఒక్కో వికెట్ తీశారు. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ భారీ స్కోరు చేసింది. ప్రియాంశ్ ఆర్య (6) నిరాశపర్చినా.. జోష్ ఇంగ్లిస్ (32బీ 12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (28బీ 18 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (53బీ 34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకం బాదగా.. చివర్లో స్టాయినిస్ (44లిబీ 16 బంతుల్లో3 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. నేహాల్ వధేరా (16), శశాంక్ సింగ్ (11) పరుగులు చేశారు. దిల్లీ బౌలర్లలో ముస్తాఫిజుర్ 3, కుల్‌దీప్ యాదవ్ 2, విప్రాజ్ నిగమ్ 2, ముకేశ్ కుమార్ ఒక వికెట్ పడగొట్టారు.




# విశాల్ ప్రియురాలి కొత్త సినిమా.. ట్రైలర్‌లో దుమ్మురేపిందిగా

సాయి ధన్సిక పేరు ఇప్పుడు సౌత్ ఇండియా చిత్రపరిశ్రమలో బాగా వైరల్ అవుతుంది. నటుడు విశాల్‌తో ఆమె ప్రేమలో ఉండటమే ఇందుకు కారణం. తాజాగా వారిద్దరూ అధికారికంగా తమ ప్రేమ విషయాన్ని ప్రకటించారు. అయితే, తాజాగా సాయి ధన్సిక నటించిన కొత్త సినిమా 'యోగి డా' నుంచి ట్రైలర్ విడుదలైంది. గౌతమ్ కృష్ణ దర్శకత్వం వహించిన యాక్షన్ తమిళ చిత్రంలో సాయాజీ షిండే, కబీర్ దుహాన్ సింగ్ నటించారు. శ్రీ మోనికా సినీ ఫిల్మ్స్ బ్యానర్‌పై వి సెంథిల్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను విశాల్ ఫిలిం ఫ్యాక్టరీ షేర్ చేసింది. భారీ యాక్షన్ సిన్స్‌లో పోలీస్ ఆఫీసర్‌గా సాయి ధన్సిక దుమ్మురేపింది. ఈ సినిమా కోసం డూప్ లేకుండానే రియల్‌గా ఆమె స్టంట్స్ చేశారట. రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన కబాలి మూవీతో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైంది ధన్సిక.. అందులో ఆయన కూతురు (యోగి) పాత్రలో మెప్పించింది. ఇప్పుడు 'యోగి డా' టైటిల్‌తో తనే ప్రధాన పాత్రలో నటించింది. త్వరలో ఈ మూవీ విడుదల కానుంది.




సందీప్ స్కెచ్ మాములుగా లేదు..

# స్పిరిట్ కోసం యానిమల్ హీరోయిన్‌ని పట్టుకొచ్చాడుగా..!




డార్లింగ్ ప్రభాస్ ప్రస్తుతం పలు సినిమాలతో బిజీగా ఉన్నాడు. దాదాపు అరడజను సినిమాలు ఆయన ఖాతాలో ఉన్నాయి. అయితే వీటన్నింటిలో కూడా అందరిలో ఆసక్తి పెంచుతున్న చిత్రం స్పిరిట్. ఇంకా షూటింగ్ కూడా స్టార్ట్ కాలేదు కానీ.. స్పిరిట్ గురించి ఓ రేంజ్‌లో చర్చలు జరుగుతున్నాయి. గతేడాది రిలీజైన కల్కి అరివీర భయంకర హిట్టు కొట్టడంతో.. ప్రభాస్ తర్వాత సినిమాలపై ఓ రేంజ్‌లో చర్చ నడుస్తుంది. ప్రస్తుతం ప్రభాస్ మారుతితో రాజా సాబ్.. హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ అనే సినిమా చేస్తున్నారు. ఈ సినిమాలు ఫినిష్ అయ్యాక సందీప్ రెడ్డితో 'స్పిరిట్' చిత్రం చేయనున్నారు. ఈ మూవీ పూర్తి అయ్యాక నాగ్ అశ్విన్ తో కల్కి %-% 2 , ప్రశాంత్ నీల్‌తో సలార్ 2.. అలానే యంగ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మతో ఒక సినిమా చేయనున్నట్టు సమాచారం స్పిరిట్ చిత్రాన్ని సందీప్ ఏ జానర్‌లో తెరకెక్కిస్తాడా అని అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఇందులో హీరోయిన్‌గా దీపిక పదుకొణేని ఎంపిక చేసినట్టు ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే దీపికా కండీషన్స్ తట్టుకోలేక ఆమె స్థానంలో యానిమల్ హీరోయిన్‌ని ఎంపిక చేశాడు సందీప్. భారీ యాక్షన్ ఎంటర్టైనర్?లో బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి డిమ్రీ హీరోయిన్?గా నటించనున్నట్లు సందీప్ శనివారం సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. దీంతో డార్లింగ్ ఫ్యాన్స్?కు హీరోయిన్ విషయంలో క్లారిటీ వచ్చేసింది. అయితే స్పిరిట్ సినిమాకు సంబంధించి అఫీషియల్?గా ఒక అనౌన్స్మెంట్ రావడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్‌లో ఉన్నారు. స్పిరిట్ అనేది ఇప్పుడు మనకు సింపుల్ వర్డ్‌లా అనిపిస్తుంది కానీ.. ఒక్క సారి సినిమా స్టార్ట్ అయ్యాక టైటిల్‌కు జస్టిఫికేషన్ అనిపిస్తుందని సందీప్ రెడ్డి వంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పాడం చూశాం. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ కూడా సందీప్ స్టార్ట్ చేసినట్లు తెలుస్తుంది. ఈ సినిమాని దాదాపు 9 భాషల్లో తీర్చిదిద్దనున్నట్లు తెలుస్తుంది. తాజాగా చిత్రంలో కథానాయిక త్రిప్తి డిమ్రీ అని అనౌన్స్ చేస్తూ ఆమె పేరును తెలుగుతో పాటు, ఇంగ్లీష్, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ, చైనీస్, జపనీస్, కొరియన్ రాశారు. అంటే ఈ సినిమాని ఆ భాషలన్నింటిలో విడుదల చేయనున్నారు. ఈ సినిమాతో ప్రభాస్ రేంజ్ ఎక్కడికో వెళ్లడం ఖాయం.




# వరుణ్ తేజ్ - మేర్లపాక గాంధీ ప్రాజెక్ట్ తొలి షెడ్యూల్ పూర్తి!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హారర్-కామెడీ సినిమా నుంచి తాజా అప్‌డేట్ వచ్చింది. 'కొరియన్ కనకరాజు' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తొలి షెడ్యూల్ అనంతపురంలో విజయవంతంగా పూర్తయినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అనంతపురంలో జరిగిన ఈ షెడ్యూల్‌లో చిత్రబృందం ఒక అద్భుతమైన పాటను చిత్రీకరించింది. అంతేకాకుండా, ప్రధాన తారాగణంపై కొన్ని కీలకమైన, ఆసక్తికరమైన సన్నివేశాలను షూట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్ పూర్తైనట్లు ప్రకటించడానికి మేకర్స్ వరుణ్ తేజ్ ఉన్న ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమా తదుపరి షెడ్యూల్ ఈ జూన్‌లో కొరియాలో ప్రారంభం కానుందని సమాచారం. ఇది ఒక ఇండో-కొరియన్ ప్రాజెక్ట్ కావడంతో, కొరియాలో చిత్రీకరణ కీలకమైన భాగంగా ఉంది. ఈ చిత్రంలో రితిక నాయక్ కథానాయికగా నటిస్తుండగా, సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మాణ భాగస్వామ్యంతో, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సహకారంతో ఈ సినిమా నిర్మితమవుతోంది. అధిక బడ్జెట్‌తో, భారీ స్థాయిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. వరుణ్ తేజ్ అభిమానులతో పాటు, హారర్-కామెడీ జానర్ ఇష్టపడే ప్రేక్షకుల్లో ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి.

# 'షష్టి పూర్తి' ట్రైలర్.. మంచి ప్రయత్నం

'షష్టి పూర్తి' సినిమా ట్రైలర్ తాజాగా వచ్చేసింది. మంచి కంటెంట్‌తోనే ఈ సినిమాను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. 'లేడీస్ టైలర్' సినిమాతో మెప్పించిన రాజేంద్రప్రసాద్, అర్చన సుమారు 38 ఏళ్ల తర్వాత మరోసారి వారిద్దరూ కలిసి 'షష్టి పూర్తి' మూవీలో నటించారు. తాజాగా ఈ మూవీ నుంచి విడుదలైన ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వస్తుంది. ఈ మూవీని పవన్ ప్రభ దర్శకత్వంలో రూపేష్ చౌదరి నిర్మించారు. ఈ చిత్రానికి ఇళయరాజా సంగీతం అందించారు. మంచి లవ్ ట్రాక్‌తో పాటు కుటుంబ విలువలకు పెద్ద పీఠ వేసినట్లు ట్రైలర్‌లో చూస్తే అర్థం అవుతుంది. రాజేంద్ర ప్రసాద్, అర్చన జంటతో పాటు రూపేష్, ఆకాంక్షా సింగ్ యంగ్ జంటగా మెప్పించనున్నారు. మే 30న ఈ చిత్రం విడుదల కానుంది.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.